ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 104 బుధవారం 01 - 04 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 104 Wednesday 01 - 04 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారు

- హరీశ్ రావు ఆగ్రహం
- రేవంత్ రెడ్డి అసెంబ్లీలో 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు
- అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు
- అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ కుస్తీ పోటీలు ఉండవని వ్యాఖ్య
- అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదని విమర్శ
- రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్
- టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని హరీశ్ రావు అన్నారు



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 31 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాలు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని - మిగతా 2 లో




## రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్

- కాగ్ గణాంకాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై కవిత మండిపాటు
- రోజువారీ ఖర్చుల కోసం కూడా ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందన్న కవిత
- గత ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా 363 రోజులు ఆర్బీఐ నుంచి నిధులు తెచ్చారని విమర్శ
- రాష్ట్రంపై రూ. 8.65 లక్షల అప్పుల భారం మోపారని మండిపాటు

## కేరళకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- వచ్చే నెలలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు
- ప్రచార పర్వంలో దూసుకుపోతున్న పార్టీలు
- స్టార్ క్యాంపెయినర్ గా కేరళకు వెళుతున్న రేవంత్ రెడ్డి

**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 31 :**
వచ్చే నెలలో కేరళంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం, కేరళలో ప్రచార పర్వాన్ని - మిగతా 2 లో

# ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- గాంధీనగర్‌లో సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే సమాధానమని వ్యాఖ్య
- వేల ఏళ్ల నాటి జైన కళాఖండాలు, పురాణాలకు నిలయంగా మ్యూజియం
- ఇది కేవలం మ్యూజియం కాదు, సాంస్కృతిక ఆరాధన కేంద్రమన్న ప్రధాని



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 31 :**
ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇవాళ మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన 'సమ్రాట్ సంప్రతి మ్యూజియం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు. అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోదీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన - మిగతా 2 లో




## బీహార్ ఆలయంలో తొక్కిసలాట

- ఎనిమిది మంది భక్తులు మృతి
- నలంద ఆలయంలో ఘోర విషాదం
- ప్రత్యేక ప్రార్థనల వేళ తొక్కిసలాట
- భద్రతా వైఫల్యమే కారణమని భక్తుల ఆరోపణ
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, విచారణకు ఆదేశం

## అమెరికా సాయం చేయదు మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

- మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్
- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు







## కోడి కూర తినేదెలా?

- నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్
- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్
- నేడు ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు పిలుపు




## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

- రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్
- ఏపీ పర్యాటక రంగ ప్రమోషన్‌పై మంత్రి లోకేశ్ దృష్టి
- సోషల్ మీడియా వేదికగా ఆకట్టుకుంటున్న ప్రచార వీడియో
- ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్ అంటూ ఆసక్తికర పోలికలు
- ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాల సంగమం ఏపీ అని ట్వీట్



## పార్లమెంటు ముందుకు అమరావతి చట్టబద్ధత బిల్లు

- ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- ముందుగా లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టనున్న కేంద్ర హోంశాఖ
- ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా
- విభజన చట్టంలోని సెక్షన్ 5కు సవరణ చేయనున్న కేంద్రం
- ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం
- జూన్ 2, 2024 నుంచి సవరణ అమల్లోకి వచ్చేలా నిబంధన
- లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు రానున్న బిల్లు

**వార్త సంధ్య, అమరావతి, మార్చి ౦31 :**
ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం దిశగా కీలక అడుగు పడింది. నేడు పార్లమెంట్ ముందుకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు రానుంది. దీని ద్వారా ఏపీకి అమరావతి ఏకైక రాజధానిగా గుర్తింపు లభించనుంది. ఇందుకు అనుగుణంగా నేడు లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ - మిగతా 2 లో

# 5 పిల్లలతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ'



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రతి నెలా 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్'
- ప్రజారోగ్యంపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- ఏడాదిలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు లక్ష్యంగా నిర్దేశం
- జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలుకు ఆదేశం
- 5 కీలక అంశాలతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ' రూపకల్పన
- సిజేరియన్లు 20 శాతానికి మించితే ఆడిటింగ్ చేయాలని స్పష్టం
- సంజీవని ప్రాజెక్టుపై క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు ఆదేశం

**వార్త సంధ్య, అమరావతి, మార్చి ౦31 :**
మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్థవంతంగా అమలు అవుతోన్న ఈ ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని - మిగతా 2 లో

# సంపాదకీయం

## మహిళల కోటాపై కదలిక



వచ్చే నెలలో జనగణన తొలి దశ ప్రారంభం కాబోతుండగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, అందరూ చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలకు సంబంధించిన పనులు ప్రారంభం కావాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగ్గది. ఈ రెండింటికీ 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటారు. వాస్తవానికి 2023లో మహిళా కోటా బిల్లును ఆమోదించినప్పుడు ఆ మరుసటి సంవత్సరంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకే దాన్ని వర్తింపజేయాలని విపక్షాలు కోరాయి. కానీ 2026 జనగణనకు ముందుగా ఇది సాధ్యంకాదని అప్పట్లో కేంద్రం చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనకూ దీన్నే కారణంగా చూపింది. ఈ హఠాత్ పునరాలోచనకు గల కారణమేమిటో కేంద్రం వివరించలేదు. అలాగే మహిళల కోటా నిర్ణయంలో ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారన్నది కూడా చెప్పలేదు. వీటికి సంబంధించిన విధి విధానాలు పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో మాత్రమే తెలిసే అవకాశం ఉంది. పునర్విభజన ప్రక్రియపై రాజకీయ పక్షాల మధ్య స్పర్థలున్నా మహిళల కోటా విషయంలో అన్ని పక్షాలూ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయి. అయినా ఆ చట్టం అమలు వాయిదా పడింది.కొన్ని అభివృద్ధి చెందిన దేశాలూ, మనకన్నా వెనకబడివున్న దేశాలూ కూడా మహిళలకు దశాబ్దాల క్రితమే చట్టసభల్లో కోటా ఇచ్చి గౌరవించాయి. రువాండాలో రాజ్యాంగం ప్రకారం 30 శాతం కాగా, ఆచరణలో దాదాపు 64 శాతం మంది మహిళలున్నారు. క్యూబాలో 55.7 శాతం, ఫ్రాన్స్, అర్జెంటీనా, దక్షిణాఫ్రికా, బొలివియా, మెక్సికోల్లో 50 శాతంవరకూ రిజర్వేషన్‌లున్నాయి. నేపాల్‌లో 33 శాతం కోటా అమలవుతోంది. మన ఎంపీల్లో మహిళలు 14 శాతం మించిలేరు. ఈ గణాంకాలు గమనిస్తే మనం ఎంత వెనకబడి ఉన్నామో అర్థమవుతుంది. ఈ ఏడాది జనగణన ప్రక్రియ మొదలైనా, తుది గణాంకాలకు ఏడాది పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు కావస్తున్నా జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు కోటా దక్కలేదు. ఇంకా ఆలస్యం చేయొద్దనుకోవటం మంచి నిర్ణయమే.అయితే నియోజకవర్గాల పునర్విభజన వివాదాస్పదం అయ్యే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల సంఖ్య నిర్ణయించటమే ఇందుకు కారణం. 2011 గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవటంవల్ల లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలూ 816కు ఎగబాకుతాయనీ, ఇందులో 273 స్థానాలు మహిళలకు లభిస్తాయనీ ఒక అంచనా. 2029 సార్వత్రిక ఎన్నికలకు దీన్ని వర్తింపజేస్తారు. తెలంగాణలో ఇప్పుడున్న 17 ఎంపీ స్థానాలు 26కు... 119 అసెంబ్లీ స్థానాలు 182కు పెరుగు తాయంటున్నారు. ఏపీకి ఇప్పుడున్న 25 ఎంపీ స్థానాలు దాదాపు 38కి, ప్రస్తుత 175 అసెంబ్లీ స్థానాలు 263కి చేరుతాయి.ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిన మహిళలు చదువుల్లో, వృత్తి ఉద్యోగాల్లో ముందుండటం, కుటుంబ నియంత్రణ వంటి కారణాలవల్ల జనాభా పెరుగుదల రేటు తగ్గింది. ఉదాహరణకు 1951లో తమిళనాడు జనాభా బిహార్‌కన్నా కొంత ఎక్కువ కాగా... ఆరు దశాబ్దాల తర్వాత బిహార్ జనాభా తమిళనాడుకన్నా ఒకటిన్నర రెట్లు అధికం. జనాభా ప్రాతిపదిక కాక, రాష్ట్రాల్లోని స్థానాలపై కొంత శాతం అధికంగా సీట్లిచ్చే విధానం ఉండాలని తమిళనాడు సీఎం స్టాలిన్ సూచిస్తున్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉండాలన్న రాజ్యాంగ అధికరణానికి ఇది విరుద్ధం. దేశంలో ప్రతి ఒక్కరి ఓటు విలువా ఒకేవిధంగా ఉండాలన్నది దీని ఆంతర్యం. కానీ జనాభారీత్యా యూపీ ఓటరు ఓటుకుండే విలువకన్నా తమిళనాడు లేదా కేరళ ఓటరు విలువ ఎక్కువుంది. ఈ వ్యత్యాసం కొనసాగనీయటం సమర్థనీయ మేనా అన్న సందేహం తలెత్తుతుంది.ప్రతి జనగణన తర్వాత దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నా, ఇందులో ఇమిడివున్న సమస్యలను పసిగట్టి గత పాలకులందరూ వాయిదాల్లో గడిపారు. 2000 సంవత్సరం వరకూ స్తంభింపజేస్తూ 1976లో... దాన్ని 2026 వరకూ పొడిగిస్తూ 2001లో రాజ్యాంగ సవరణలు తెచ్చారు. మొత్తానికి ఈ భారం ప్రస్తుత పాలకులపై పడింది. ఎవరికీ అన్యాయం జరగకుండా, ఉత్తరదక్షిణాల వ్యత్యాసం రాకుండా సమస్యను పరిష్కరించగలిగితే దేశ సమైక్యతకు అది దోహదపడుతుంది.

# ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. “ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్“ అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. “పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్చారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి“ అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి** – భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియో–విజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు.

**‘వికాస్ భీ, విరాసత్ భీ‘కి ఇది నిదర్శనమన్న గుజరాత్ ప్రభుత్వం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ.. ‘వికాస్ భీ, విరాసత్ భీ‘ (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.

# బీహార్ ఆలయంలో తొక్కిసలాట

**మొదటిపేజీ తరువాయి** – బీహార్‌లోని నలంద జిల్లాలో మంగళవారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మగ్రా గ్రామంలోని ప్రసిద్ధ శీతలా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో డజను మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో భయాందోళన వాతావరణం నెలకొంది. భక్తులు పరుగులు తీయడంతో పలువురు మహిళలు కిందపడిపోయారు. వారిపై నుంచే ఇతరులు వెళ్లడంతో ఊపిరాడక 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం ఆలయం వద్ద రద్దీ ఉంటుందని తెలిసినా, యంత్రాంగం తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో తగినంత మంది పోలీసులు లేరని, అంబులెన్స్‌లు కూడా ఆలస్యంగా చేరుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంపై బీహార్ ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# 5 పిల్లర్లతో ‘ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ‘

**మొదటిపేజీ తరువాయి** – సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలని చెప్పారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా అందుకు సీఎం అంగీకారం తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకి వివరించారు. వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని సీఎం అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం



లభిస్తుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు.వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదు: మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని ఈ 5 పిల్లర్లతో త్వరలో ‘ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ’ తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చించారు.వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంటిగ్రేషన్ జరగాలని అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# పార్లమెంటు ముందుకు అమరావతి చట్టబద్ధత బిల్లు

**మొదటిపేజీ తరువాయి** – పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2026 బిల్లును కేంద్ర హోంశాఖ ప్రవేశ పెట్టనుంది. దీనిపై ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి అనుగుణంగా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం ముందడుగు వేసింది. లోక్‌సభ బిజినెస్ జాబితాలో ఈ మేర చట్టసవరణ బిల్లు డ్రాఫ్ట్ అప్లోడ్ చేశారు. లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు ఈ బిల్లు వెళ్లనుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత రాజపత్రం (గెజిట్) విడుదల కానుంది. దీంతో అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అధికారికంగా గుర్తింపు దక్కుతుంది.కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరణ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టసవరణ బిల్లు లక్ష్యాలు, కారణాలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014లో సెక్షన్ 5 ప్రకారం, నిర్ణీత తేదీ నుంచి 10 ఏళ్లపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైదరాబాద్ సంయుక్త రాజధానిగా ఉంటుందని తెలిపారు. ఆ కాలం పూర్తయ్యాక హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవ్వాలని తెలిపారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర పరిశీలన, సంప్రదింపులు, ప్రణాళికల అనంతరం “అమరావతి” ని కొత్త రాజధానిగా గుర్తించి ప్రకటించిందన్నారు.అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటు చేసే లక్ష్యంతో అక్కడ మౌలిక వసతుల అభివృద్ధితోపాటు పలు పరిపాలనా శాసన చర్యలు చేపట్టబడ్డాయన్నారు. 2026 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ మేర తీర్మానం ఆమోదించిందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్-5ను సవరించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా “అమరావతి” పేరును చేర్చాలని భారత ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానానికి అమలు చేస్తూ రాష్ట్ర రాజధాని విషయంలో చట్టబద్ధమైన స్పష్టత ఇవ్వడానికి ఆ చట్టంలోని సెక్షన్ 5లోని ఉపవిభాగం (2)ను సవరించి, “అమరావతి” పేరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదించబడిందని వివరించారు. ఈ మార్పు 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని అమిత్‌షా వెల్లడించారు.అమరావతి రాజధాని పరిణామాలు: 2014 జూన్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ద్వారా రాష్ట్ర విభజన జరిగింది. కానీ హైదరాబాద్ 10 ఏళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అప్పట్లో నిర్ణయించారు. 2014 సెప్టెంబర్‌లో ఏపీ నూతన రాజధానిగా అమరావతి అని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2016-2019 మధ్య వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలు పూర్తి చేసి పరిపాలన ప్రారంభించారు. రాజధాని కోసం సింగపూర్ సంస్థల భాగస్వామ్యంతో మాస్టర్ ప్లాన్ రూపొందించి మౌలిక సదుపాయాల పనులు చేపట్టారు. జూన్ 2016న హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి పరిపాలనను ఏపీకి తరలించే ప్రక్రియ ఊపందుకుంది. అలాగే అప్పుడే ఉద్యోగుల తరలింపు ప్రారంభమైంది.అక్టోబర్ 2016న వెలగపూడిలో రికార్డు స్థాయిలో కేవలం కొన్ని నెలల్లోనే నిర్మించిన తాత్కాలిక సచివాలయ భవనాలు ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచే పూర్తిస్థాయి పరిపాలన మొదలైంది. 2017 ఫిబ్రవరిలో అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ భవనం ప్రారంభమవగా శాసనసభ సమావేశాలు మొదటిసారిగా అక్కడ నిర్వహించారు. 2018లో శాశ్వత ప్రభుత్వ భవనాల డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేయగా సచివాలయం కోసం 2 ఐకానిక్ టవర్ల నిర్మాణానికి పునాదులు పడ్డాయి. 2019 ఫిబ్రవరిలో తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభించగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీనిని ప్రారంభించారు.భూ సమీకరణ ప్రక్రియ: 2014 డిసెంబర్ 8న భూసమీకరణ కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం ప్రకారం చేపట్టారు. 2014 డిసెంబర్ 30న ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం అమలులోకి వచ్చింది. ముందుగా తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి మండలాల్లోని 29 గ్రామాల్లో భూసమీకరణ కోసం తొలి స్పందన ప్రారంభమైంది. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమ్మతి పత్రాలు (9.27 ఫారాలు) ఇవ్వడం మొదలుపెట్టారు. 2015 ఫిబ్రవరి 28న ప్రభుత్వం విధించిన గడువు ముగిసే నాటికి 33,927 ఎకరాల భూమిని 28 వేల మంది రైతులు ప్రభుత్వానికి అప్పగించారు.రాజధానిగా గుర్తిస్తూ పనులు పునఃప్రారంభం: 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పనులు పునఃప్రారంభమయ్యాయి. అలానే విభజన చట్టాన్ని సవరించి అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం, శాసనసభ తీర్మానం చేసి లోకసభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్, కేంద్ర హోం మంత్రికి పంపింది.

# అమెరికా సాయం చేయదు
# మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

**మొదటిపేజీ తరువాయి** – అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్‘లో ఒక పోస్ట్ పెట్టారు.“ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి“ అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. “అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి“ అని ట్రంప్ స్పష్టం చేశారు.అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# కేరళకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – మరింత వేడెక్కించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రంగంలోకి దించింది. ఈ సాయంత్రం ఆయన కేరళంకు బయలుదేరి వెళ్లనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డిని, ఇప్పుడు కేరళంలో ‘స్టార్ క్యాంపెయినర్‘గా నియమించారు. ఆయన వాగ్ధాటి, మాస్ అప్పీల్ కేరళ ఓటర్లను, ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటుందని ఏఐసీసీ భావిస్తోంది. రెండు



రోజుల పాటు ఆయన అక్కడ విస్తృతంగా పర్యటించి, పలు బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొని పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు.కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా, తెలంగాణకు చెందిన పలువురు కీలక మంత్రులకు కూడా కేరళం ఎన్నికల బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. ఎర్నాకులం, హోసూరు జిల్లాల ఇన్చార్జిగా నియమితులైన శ్రీధర్ బాబు ఏప్రిల్ 7 వరకు అక్కడే ఉండి ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించనున్నారు. మరో మంత్రి పొంగులేటి ఇప్పటికే కేరళంకు చేరుకున్నారు. పతినంతిట్ట జిల్లాలోని ఆడూరు, అరుణ్మల నియోజకవర్గాల్లో ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈయన కూడా ఏప్రిల్ 7 వరకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండనున్నారు.

# కోడి కూర తినేదెలా?

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్రంలో నేటి నుంచి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ షాపులకు కమీషన్ తగ్గించాయని వెంటనే వాటిని పెంచాలని డిమాండ్ చేస్తూ అప్పటివరకు దుకాణాలు మూసివేయాలని చికెన్ షాపుల అసోసియేషన్ నిర్ణయించింది. తమకు న్యాయం చేయాలంటూ నేడు మహాధర్నాకు పిలుపునిచ్చారు. కిలో చికెన్‌పై ప్రస్తుతం ఇస్తున్న మార్జిన్‌ను రూ. 26ను రూ.30 వరకు పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్. దీనికోసమే నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్ చేపట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఏర్పాటు చేసిన రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రోజురోజుకు పెరుగుతున్న అద్దెలు, కూలీల జీతాలు, విద్యుత్తు బిల్లులు, రవాణా ఛార్జీల నిర్వహణ భారంగా పరిణమిస్తున్న నేపథ్యంలో కంపెనీలు చెల్లించే మార్జిన్ న్యాయబద్ధంగా లేదని, తమకు నష్టాలే మిగులుతున్నాయని అసోసియేషన్ ఆక్షేపించింది. నేడు ఉదయం 9 గంటల నుంచి దుకాణాలు బంద్ చేసి ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేయబోతున్నట్లు సభ్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు స్పందించాలని తెలంగాణ రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం డిమాండ్ చేసింది. చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తమకు ముందుగా తమకు ప్రజలు సహకరించాలని కోరుతున్నట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ షాప్‌లకు ఇస్తున్న మార్జిన్‌లో ఇప్పుడు కోత విధించి చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆలోచనను పౌల్ట్రీ కంపెనీలు మానుకోవాలని సూచించారు. మార్జిన్‌లో ఎటువంటి కోత పెట్టకూడదన్నారు. 20 ఏళ్ల క్రితం, ప్రస్తుత కాలంలో చాలా మార్పులున్నాయని, గతంలో కూలీలకు 5 నుంచి 6 వేల వరకు జీతాలు ఇచ్చేవారమని ఇప్పుడు ఒక్కరికే 20 నుంచి 25 వేల వరకు చెల్లిస్తున్నామని అన్నారు. ఇలా ఒక్కో షాపులో ముగ్గురు వర్కర్లు పని చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు నష్టాలు వస్తున్న నేపథ్యంలో వాళ్లకు కూడా జీతాలు చెల్లించే పరిస్థితి లేదని వాపోయారు. ఎంత మార్జిన్ ఇస్తే వర్కౌట్ అవుతుందనే విషయం పౌల్ట్రీ కంపెనీలకు తెలుసన్నారు. కానీ కావాలనే ఈ చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తాము వేరే దగ్గరకు వెళ్లి బిజినెస్ పెట్టుకుని చేసే పరిస్థితి లేదని తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు అన్నారు. ప్రభుత్వం కూడా తమ ప్రభుత్వంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయబోతున్నట్లు ప్రకటించారు. అన్ని జిల్లాల నుంచి చికెన్ షాపు దుకాణాదారులు పాల్గొంటారని తెలిపారు. శాంతియుతంగా తమ నిరసన ఉంటుందన్నారు. తమకు న్యాయమైన మార్జిన్ వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.తాము ఇప్పుడు కేవలం కిలో చికెన్‌పై రూ.4 మార్జిన్ పెంచమని అడుగుతున్నట్లు తెలిపారు. అది కూడా వెయిట్ లాస్ పోతుందని చెప్పారు. తమలాంటి చిన్నచిన్న షాపులకు ఎటువంటి డిమాండ్లు ఉండవన్నారు. ఇప్పుడు పౌల్ట్రీ రంగం మొత్తం కార్పొరేట్ అయ్యిందని వాపోయారు. తమకు న్యాయమైన మార్జిన్ ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారు

**మొదటిపేజీ తరువాయి** – ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు.ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు.సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.

# రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, రోజువారీ ఖర్చుల కోసం కూడా ప్రభుత్వం ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ వెల్లడించిన గణాంకాలను ప్రస్తావిస్తూ ఆమె సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పెట్టారు. కాగ్ నివేదిక ప్రకారం... గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం మీద కేవలం



రెండు రోజులు తప్ప, మిగిలిన 363 రోజులు ప్రభుత్వం ఆర్బీఐ నుండి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్ట్‌ల పేరుతో నిధులు సేకరించిందని కవిత పేర్కొన్నారు. “సుమారు రూ. 1.30 లక్షల కోట్లు తెచ్చి సర్కారును నెట్టుకొచ్చారు. 2025 మార్చి 31 నాటికి సుమారు రూ. 6 వేల కోట్లు తిరిగి చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది“ అని ఆమె ఆరోపించారు.రాష్ట్రానికి నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్నప్పటికీ, రోజువారీ ఖర్చులకు కనీసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటైన్ చేయలేకపోతున్నారని కవిత విమర్శించారు. రాష్ట్రంపై మొత్తం రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు మోపి, ప్రతి కుటుంబంపై సగటున రూ. 9 లక్షల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని ధ్వజమెత్తారు. అప్పులు తెస్తూ ఇంకా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని చెప్పడం ప్రజలను వంచించడమేనని ఆమె మండిపడ్డారు.ఎన్నికల సమయంలో ‘సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం‘ అని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు వట్టి డొల్ల అని కాగ్ నివేదికతో తేలిపోయిందని కవిత ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి, తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగ్ నివేదిక సాక్షిగా ప్రభుత్వ వైఫల్యం బట్టబయలైందని ఆమె స్పష్టం చేశారు.

## మంత్రి పొంగులేటిపై బిఆర్ఎస్ నేతల విమర్శలను ఖండించిన లింగాల



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 31 :** 43డబడగతెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై బిఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదని అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజాసంఘాల రాష్ట్ర చైర్మన్ లింగాల రవికుమార్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాడు పొంగులేటిని రాజకీయంగా అడ్డుకోవాలని ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీస్సులతో బిఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర వహించి రాష్ట్ర అభివృద్ధికి పొంగులేటి ఎంతో కృషి చేస్తున్నారని లింగాల అన్నారు పొంగులేటి నిరంతరం ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా పొంగులేటి కి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నేతలు పొంగులేటిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని లింగాల రవికుమార్ అన్నారు పొంగులేటిని రాజకీయంగా ఎదుర్కోలేక రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని గృహ నిర్మాణ శాఖామంత్రిగా వేలాది మందికి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తున్నారని పొంగులేటి అంటే జనం జనం అంటే పొంగులేటి అని లింగాల స్పష్టం చేశారు హైదరాబాదులో ఆయన పత్రికలతో మాట్లాడుతూ పొంగులేటి పై విమర్శలు మానుకోవాలని ఆయన అన్నారు

## కూకట్‌పల్లిలో లబ్ధిదారులకు 'ముఖ్యమంత్రి సహాయనిధి' చెక్కుల పంపిణీ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, ఝజజ ఉపాధ్యక్షులు శ్రీ బండి రమేష్ మంగళవారం పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 2,30,000/- విలువైన ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు.

**లబ్ధిదారుల వివరాలు:**

శ్రీ బండి రమేష్ చొరవతో దరఖాస్తు చేసుకున్న కింది వారికి సహాయం అందింది: జి. సరస్వతమ్మ (ముసాపేట్): రూ. 60,000/- చోటి అప్ప మొహమ్మద్ (ఫతేనగర్): రూ. 60,000/- కుమార్ రెప్పన తరుణ్ (ఫతేనగర్): రూ. 60,000/- జానోలు అనసూయ (బాలనగర్): రూ. 50,000/-హేమ దుర్గా భవన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెక్కులను అందుకున్న లబ్ధిదారులు, తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి, కృషి చేసిన బండి రమేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, మోయిజ్, సలీం, మస్తాన్ రెడ్డి, కనకయ్య, మధు, అయాజ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజానాయకుడు పొంగులేటిపై విషప్రచారమా..?

### రేగళ్ల పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ నాయక్ తీవ్ర హెచ్చరిక



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 31 (వార్త సంధ్య) :** వట్టినాగులపల్లి సర్వే నెంబర్ 245 లో జరుగుతున్న భూ వివాదానికి సంబంధించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని భూమి యజమానులు ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ, బీఆర్ఎస్ నాయకులు కావాలనే విషప్రచారం చేస్తున్నారని రేగళ్ల పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రాఘవ కన్స్ట్రక్షన్స్‌తో ఎలాంటి డెవలప్మెంట్ ఒప్పందం జరగలేదని యజమానులు వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తూ, కావాలనే రాజకీయ లాభాల కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజా ప్రతినిధులు, చిల్లర రాజకీయాలకు దిగజారడం బాధాకరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ల అవగాహన రాహిత్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. ఇకపై ఇలాంటి తప్పుడు ప్రచారం కొనసాగిస్తే బీఆర్ఎస్ నేతల ఇళ్లను ముట్టడి చేస్తామని సర్పంచ్ లావుడ్య పూర్ణ నాయక్ ఘాటుగా హెచ్చరించారు.

## అమెరికా యుద్ధ పోకడలు ప్రమాదకరం

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 31 (వార్త సంధ్య) :** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధాలు ప్రపంచ శాంతికి ముప్పుగా మారాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, యుద్ధాల వల్ల అమాయకులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు. యుద్ధాల ప్రభావంతో దేశంలో ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. మావోయిస్టులపై చర్యలు సహజ వనరుల దోపిడీ కోసమేనని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే ను పరిశీలించిన

## కమిషనర్ సునీల్ దత్, ప్రాజెక్టు మేనేజర్ దివ్య



**ఖమ్మం జిల్లా ప్రతినిధి, మార్చి 31 ( వార్త సంధ్య) :** వైరా మండలం గ్రీన్ ఫీల్డ్ హైవే ను ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మేనేజర్ దివ్య తో కలిసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. త్వరలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవరం గ్రామం నుంచి వైరా పట్టణం రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. వైరా రింగ్ రోడ్ సెంటర్ నందు రోడ్డు ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగాఉండాలని, వాహనదారులు సీట్ బెల్ట్, హెల్మెట్లు ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి డ్రైవ్ చేయవద్దని సూచించారు. వారితో వైరా ఏసీపీ సారంగపాణి, సిఐ వెంకటప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

## వస్తాకొండూర్ గ్రామంలో ఘనంగా ముందస్తు బడిబాట కార్యక్రమం



**యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చ్ 31(వార్త సంధ్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం లోని వస్తాకొండూర్ గ్రామంలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ మంగళవారం ఉదయం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూలకంటి నర్సిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలు ,అయిన మీఞజుూ ాజఞూూా, ఖ+దీఎ వైపు పోవడం వల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది కానీ ఇప్పుడు పాఠశాల లో ఉపాధ్యాయులు అందుబాటులో వచ్చారని కావున విద్యార్థులు వ్యయ ప్రయాసలు పడి దూర ప్రాంతాల పాఠశాలలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా మన గ్రామం లో ఉన్న ఉన్నత పాఠశాల కు రావాలని కోరారు ఆ మేరగా గ్రామస్థులు , తల్లిదండ్రులు నిర్ణయం తీసుకొని పాఠశాల కు విద్యార్థులను పంపాలని కోరారు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపాల రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల లో ాఖ+, ఖఖ+ లేకపోవడం వల్ల 3 సంవత్సరాల కే ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడం జరుగుతుంది దాని వలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం జరుగుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం కూడ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ - ప్రైమరీ తరగతులను కొన్ని చోట్ల ప్రారంభించారు అదే విధంగా అన్ని పాఠశాలల్లో కూడా మొదలు చేసి 3 సంవత్సరాల కే విద్యార్థులను బడిలో చేర్చుకునే లా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆ దిశగా మన ఊరు లో కూడా ప్రీ- ప్రైమరీ ఎడ్యుకేషన్ విధానం అమలులోకి చేసుకొని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే లా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించడం కోసం గ్రామ పెద్దలు అందరూ సహకరించాలని కోరారు గ్రామ సర్పంచ్ లింగాల అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ వస్తాకొండూర్ గ్రామ పాఠశాల కు ఘనమైన చరిత్ర ఉందని చుట్టుపక్కల ఎన్నో గ్రామాల నుండి వందల విద్యార్థులు వచ్చేవారని ఇప్పుడు పాఠశాల కనుమరుగు కాకుండా గ్రామ సర్పంచ్ గా నా వంతు కృషి, చేసి మరల ఈ పాఠశాల కు గత వైభవం తీసుకు రావడానికి గ్రామ ప్రజా ప్రతినిధులు, అందరం కలిసి విద్యార్థులు తల్లిదండ్రులను ఒప్పించి మన బడి కి పంపడం కోసం ఈ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు ఉప సర్పంచ్ పరుశురాములు మాట్లాడుతూ ఈ ఊరిలో కి జనగామ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బస్సులు వస్తున్నాయని వాటిని అడ్డుకుని మా గ్రామ విద్యార్థులను మా జిల్లా లోని మా గ్రామ ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులను చేర్పించడానికి వారి తల్లిదండ్రులను కలిసి నాన్ లోకల్ జిల్లా లో చదవడం వలన రాబోయే జిల్లా స్థాయి ఉద్యోగ నియామకాల లో ఏర్పడే ఇబ్బందికర పరిస్థితుల ను వారికి తెలియజేస్తూ తప్పనిసరి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే దిశగా మేమంతా నడుము బిగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ాూ్రాజ మాజీ చైర్మన్, లింగాల బిక్షం గౌడ్ మరియు గ్రామ శ్రేయాభిలాశి విద్యావంతులు , గతం లో విద్యా వాలెంటెరుగా పనిచేసిన వీరమల్ల సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో , ఉన్నత విద్యావంతులు, చక్కటి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారు అని వారి వల్ల నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు దార శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు పద్మ, రమ, రాజమణి, వీవోఏ సునీత ,ఆశాకార్యకర్త రజిత , దీూా ,రాజు , గనగాని వెంకన్న, సోమనారి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు, యువతకు, మహిళలకు కాంగ్రెస్ పార్టీలో ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో పార్టీ విస్తరణకు కృషి చేసేవారికి తగిన పదవులు దక్కుతాయి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేసే వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ముందుంటుంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు బొమ్మక అజయ్, రాష్ట్ర ఇంచార్జ్ భవ్య, జనరల్ సెక్రెటరీ రమ్య యాదవ్, సీనియర్ నాయకులు ఎండి మోయిజ్, రామ్ రెడ్డి, హరి ప్రసాద్, సల్మాన్, యూత్ అధ్యక్షుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు

### డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి

### విద్యార్థుల చదువుపై సంతృప్తి

### గ్రంథాలయ అభివృద్ధికి సహకారం, హామీ



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 31 (వార్తా సంధ్య) :** గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె గ్రంథాలయ చైర్మన్ ఆహ్వానం మేరకు గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబుతో ఆమె జిల్లాలోని గ్రంథాలయాల పనితీరుపై ముచ్చటించారు అనంతరం గ్రంథాలయంలోని సదుపాయాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయంలో క్రమశిక్షణతో చదువుకుంటున్న తీరు చూసి ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, గ్రంథాలయ అభివృద్ధి ద్వారా పలువురు ఉద్యోగాలు సాధించిన విషయాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు ఒక్కటే జీవితాన్ని తీర్చిదిద్దగలరని, విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయగలరు'' అని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. గ్రంథపాలకురాలు జి. మణిమృదుల పనితీరును ప్రత్యేకంగా అభినందించిన ఆమె, గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కనకాల నవీన్ కుమార్ , సిరిపురపు జస్వంత్ సాయి విద్యార్థిని విద్యార్థులు పాఠకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం




**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ మార్చి 31(వార్త సంధ్య):**రాయికల్ మండలం కిష్టం పెట్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం ను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం పేరుతో వ్యక్తులను తక్కువ చేసి చూడడం వివక్ష చూపడం తిట్టడం కొట్టడం లాంటివి నేరంగా పరిగణించబడుతుంది అని అందరూ కలిసిమెలిసి జీవించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు గూర్చి వివరించి వినియోగించుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఆకుల అంజ గౌడ్,అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ మరంపల్లి రవి, ఏనుగంటి ప్రవీణ్ , మాజీ సర్పంచ్ తంగెల్ల రమేష్,మండల మండలం రెవెన్యూ ఇన్స్ పెక్టర్ దేవదాస్ , మండలం ఆఫీసర్ జీపీ ఓ అంజలి తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళిక జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 31 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈరోజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్ష సందర్భంగా, ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపి) ప్రకారం ఏప్రిల్ 2 నుండి ఖచ్చితంగా గ్రామసభలు మరియు వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సభలను నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించాలని, అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు చురుగ్గా పాల్గొనేలా చూడాలని ఆయన ఉద్ఘాటించారు.సామూహిక సంప్రదింపు కార్యక్రమంగా ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, ప్రజల భాగస్వామ్యాన్ని సమీకరించాలని ముఖ్య కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, కొనసాగుతున్న సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల గురించి పౌరులకు సమగ్రంగా తెలియజేయాలని ఆయన నొక్కి చెప్పారు.ఈ సభల సమయంలో లబ్ధిదారుల నుండి అభిప్రాయాన్ని క్రమపద్ధతిలో సేకరించాలని, ప్రభుత్వం తన కార్యక్రమాలు మరియు ఐదేండ్ల ప్రభావాన్ని అంచనా వేయడానికి వీలు కల్పించాలని ఆయన ఆదేశించారు.

## కైతలాపూర్‌లో విషాదం ఇద్దరు కుమారులతో కలిసి తల్లి ఆత్మహత్య



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కైతలాపూర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును బలితీసుకున్నాయి. మనస్పర్థల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఒక తల్లి, తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.స్థానిక సమాచారం ప్రకారం, కైతలాపూర్ రాఘవేంద్ర సొసైటీ ప్రాంతానికి చెందిన బానోత్ శ్రావంతి (27) భర్త ప్రవీణ్ తన ఇద్దరు కుమారులూ కార్తీక్ (10) , కౌశిక్ (8) కలిసి నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో వివాదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం ఈ గొడవలు ముదరడంతో, తీవ్ర ఒత్తిడికి లోనైన ఆమె ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. మొదట తన ఇద్దరు కుమారులకు ఆపై తాను కూడా ఉరివేసుకుని ప్రాణాలు వదిలినట్లు సమాచారం. ఇంటి నుంచి ఎలాంటి శబ్దం రాకపోవడంతో అనుమానం వచ్చిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు తలుపులు బద్దలుకొట్టి చూడగా, ముగ్గురు విగతజీవులుగా పడి ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వేధింపులే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

## పెద్ద చీకోడ్ గౌడన్నల మర్యాదపూర్వక భేటీ





**దుబ్బాక ప్రతినిధి మార్చి 31(వార్త సంధ్య ) :** దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన గౌడన్నలు అందరూ కలిసి బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ అక్క గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, గౌడ సంఘానికి సంబంధించిన అంశాలు మరియు స్థానిక సమస్యలపై ఆమెతో చర్చించారు. గౌడన్నలు తమ సమస్యలను అక్క గారికి వివరించగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ భేటీలో గౌడ సంఘ సభ్యులు, మరియు యువకులు పాల్గొన్నారు.

## రాందేవరావు ఆస్పత్రి ఫ్లష్ ట్యాంక్‌లో నవజాత శిశువు మృతదేహం లభ్యం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి లోని రాందేవరావు ఆస్పత్రిలో విషాదకర ఘటన వెలుగుచూసింది. మంగళవారం ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఓపీడీ మహిళా వాష్‌రూమ్ ఫ్లష్ ట్యాంక్‌లో ఒక నవజాత మగ శిశువు మృతదేహం లభ్యమైంది. ఆస్పత్రిలో పనిచేసే నరసమ్మ అనే ఆయా వాష్‌రూమ్‌ను శుభ్రం చేయడానికి వెళ్లిన సమయంలో ఫ్లష్ ట్యాంక్‌లో శిశువు మృతదేహాన్ని గమనించి ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గుర్తుతెలియని మహిళ ఆస్పత్రి వాష్‌రూమ్‌లోనే ప్రసవించి, శిశువును అక్కడ వదిలేసి వెళ్ళిందా లేదా మృతదేహాన్ని బయట నుంచి తెచ్చి ఇక్కడ పడవేసారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. "నిందితులను గుర్తించేందుకు ఆస్పత్రిలోని సిసి ఫుటేజీని పరిశీలిస్తున్నాం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చెసినా పోలీసు అధికారులు ప్రస్తుతం పోలీసులు ఆస్పత్రి రికార్డులను, గడిచిన 24 గంటల్లో ఓపీడీకి వచ్చిన గర్భిణీల వివరాలను సేకరిస్తున్నారు. శిశువు మృతికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్ట్ తర్వాతే తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

## దుబ్బాకలో బీఆర్ఎస్ నేతకు పరామర్శ





**దుబ్బాక ప్రతినిధి మార్చి 31( వార్త సంధ్య ) :** దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సంఘం ప్రభాకర్ తండ్రి ఇటీవల మరణించగా, ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , ఇతర ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దుబ్బాక ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**దుబ్బాక ప్రతినిది మార్చి 31(వార్త సంధ్య ) :** దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చీకోడ్ బీఆర్ఎస్ అధ్యక్షులు మల్లేశం, బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ కాసారం కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, అశోక్, దేవరాజు, కిషన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళ ద్వారా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న

# ప్రతిమ బోటు స్ఫూర్తిదాయక ప్రయాణం

వార్త సంధ్య ప్రత్యేక కథనం

## "ఆదర్శం"

కలలను నమ్మితే సాధ్యమేనని నిరూపించిన జీవిత కథలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. అలాంటి స్ఫూర్తిదాయక వ్యక్తిత్వాల్లో ప్రతిమ బోటు ఒకరు. ఆంధ్రప్రదేశ్‌లోని సాధారణ గ్రామం నుంచి ప్రారంభమైన ఆమె ప్రయాణం, నేడు అంతర్జాతీయ కళా వేదికల వరకు విస్తరించి వందలాది మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.





### ఆసక్తి నుంచి ఆత్మవిశ్వాసం వరకు

జీవితంలోని మధ్యకాలంలో కళపై ఉన్న తన ఆసక్తిని గుర్తించిన ప్రతిమ బోటు, దానిని కేవలం అభిరుచిగా కాకుండా జీవిత ధ్యేయంగా మార్చుకున్నారు. ప్రారంభంలో చిన్న ప్రయత్నంగా మొదలైన కళా ప్రయాణం, క్రమంగా ఆమె వ్యక్తిత్వాన్ని మార్చిన గొప్ప మార్గంగా మారింది. ప్రముఖ చిత్రకారుడు ఆర్. రాజేంద్రన్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన ఆమె, అనంతరం భారతీయార్ విశ్వవిద్యాలయం నుంచి ఫైన్ ఆర్ట్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేసి కళారంగంలో బలమైన పునాది వేసుకున్నారు.






### మహిళా భావజాలాన్ని ప్రతిబింబించే కళ

ప్రతిమ బోటు చిత్రాల్లో మహిళల బలం, భావోద్వేగాలు, సాంస్కృతిక విలువలు ప్రతిఫలిస్తాయి. మహిళత్వం యొక్క అందాన్ని మరియు అంతర్గత శక్తిని ఆమె కళ ప్రత్యేకంగా చూపిస్తుంది. చిత్రకళతో పాటు సంప్రదాయ రంగోలీ కళలో కూడా ఆమెకు మంచి నైపుణ్యం ఉంది. మహాశివరాత్రి, రథసప్తమి వంటి పండుగల సందర్భంగా రూపొందించే రంగోలీలు భారతీయ సంప్రదాయం, ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తాయి.

### జాతీయ--అంతర్జాతీయ గుర్తింపులు

కళాపట్ల అంకితభావానికి అనేక అవార్డులు ఆమెను వరించాయి. ముఖ్యంగా రబీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు, స్పీకింగ్ ఆర్ట్ 2021 బ్రోంజ్ అవార్డు, నాటా తెలుగు నంది అవార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (2022), ఎక్సలెన్స్ ఇన్ ఆర్ట్ ఎడ్యుకేషన్ అవార్డు, బాపు చిత్రకళ అవార్డు (2024), బెస్ట్ టీచర్ అవార్డు (2018) వంటి గౌరవాలు ఆమె ప్రతిభకు నిదర్శనం.

### తల్లి నుంచి గురువుగా... ప్రపంచానికి మార్గదర్శిగా

తన కుమార్తెకు డ్రాయింగ్ నేర్పాలనే ఉద్దేశంతో ప్రారంభమైన బోధన ప్రయాణం, నేడు వందలాది విద్యార్థులను తీర్చిదిద్దే స్థాయికి చేరుకుంది.

డీఆర్ఏ అకాడమీ ద్వారా ఆమె ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు నిర్వహిస్తూ భారతదేశంతో పాటు విదేశాల్లోని విద్యార్థులకు కళను అందిస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, స్వీడన్, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాలు తమ పిల్లలకు భారతీయ సంస్కృతిని పరిచయం చేయడానికి ఈ అకాడమీని ఆశ్రయిస్తున్నాయి.



### విద్యార్థుల విజయాలతో ప్రపంచ గుర్తింపు

ఆమె శిక్షణలో పెరిగిన విద్యార్థులు అంతర్జాతీయ చిత్రకళ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సహా అనేక పురస్కారాలు సాధిస్తూ అకాడమీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నారు.

### కళ ద్వారా మహిళలకు సాధికారత

వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా, ప్రతిమ బోటు అనేక మహిళలకు కళా శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. కళ ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా వారిని ప్రోత్సహిస్తున్నారు.



### ఆదర్శంగా నిలిచిన ప్రయాణం

ఒక చిన్న గ్రామం నుంచి ప్రపంచ వేదికల వరకు సాగిన ప్రతిమ బోటు ప్రయాణం పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం కలిస్తే సాధ్యం కానిది ఏదీ లేదని తెలియజేస్తోంది. కళాకారులకు మాత్రమే కాకుండా ప్రతి మహిళకు, ప్రతి కలలకూ ఆమె జీవితం ఒక ఆదర్శంగా నిలుస్తోంది.



---

## ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ / రంగారెడ్డి జిల్లా బ్యూరో -- వార్త సంధ్య:** ప్రజా పాలన -- ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు జిల్లా కలె క్టర్లకు ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం ప్రజాభవన్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. గ్రామసభలను రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సభ ప్రారంభంలో ముఖ్యమంత్రి సందేశం వినిపించి, అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించాలని ఆదేశించారు. జూన్ 2 నుంచి అమలు చేయనున్న జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమం, ఇంటర్ కళాశాలల్లో కొత్త మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. గ్రామపంచాయతీలకు విడుదలైన నిధుల వివరాలను గ్రామాల వారీగా ప్రకటించాలని సూచించారు. సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాలు, సేవారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇండియా పోస్ట్ పేరిట ఘరానా మోసాలు

ఇండియా పోస్ట్ 170వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత బహుమతులు అందిస్తోందంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో ఒక సందేశం విపరీతంగా వ్యాపిస్తోంది. అయితే ఇది పూర్తిగా నకిలీ అని, సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం దొంగిలించడానికి పన్నిన వల అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశంలో ఉండే లింక్‌ను క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తే మోసపోవడం ఖాయమని హెచ్చరించింది. ఈ మోసంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలను అప్రమత్తం చేసింది. ఇండియా పోస్ట్ ఎలాంటి లక్కీ డ్రాలు గానీ, బహుమతుల పంపిణీ గానీ నిర్వహించడం లేదని, వైరల్ అవుతున్న సందేశం ఒక స్కామ్ అని తేల్చిచెప్పింది. 'ఇండియా పోస్ట్ పేరుతో జరుగుతున్న ఈ లక్కీ డ్రా నకిలీది. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకండి. మీ వ్యక్తిగత వివరాలను పంచుకోకండి' అని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఏదైనా ఆఫర్ లేదా ప్రకటనపై సందేహం ఉంటే, నేరుగా ఇండియా పోస్ట్ అధికారిక వెబ్‌సైట్ లేదా వారి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం ఉత్తమమని వారు చెబుతున్నారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండటమే సైబర్ మోసాల నుంచి రక్షణ అని సూచిస్తున్నారు.

## ఏనుగులు, గుర్రాలపై వెంటాడి, వేటాడే 'తాటకి వధ'

### ఏటా 3 రోజుల ఉత్సవాలు

### 200 ఏళ్ల చరిత్ర

### తాటకి వధపైనా ఏటా 3 రోజుల ఉత్సవాలు

### మధ్యప్రదేశ్‌లోని గరౌలి గ్రామంలో 200 ఏళ్లుగా వేడుకలు 18 గ్రామాల ప్రజానీకం హాజరు

### ఉత్సవాల నిర్వహణ వెనుక చారిత్రక ఫ్లాష్‌బ్యాక్




విశ్వామిత్ర మహర్షి యజ్ఞానికి పదేపదే అడ్డుతగులుతున్న తాటకి అనే రాక్షసిని ఒకే ఒక్క బాణంతో భగవాన్ శ్రీరాముడు అంతం చేశారు. ఆ ఘట్టాన్ని, రామబాణం శక్తిని గుర్తు చేసుకుంటూ గత 200 ఏళ్లుగా ఓ గ్రామంలో ఏటా వేడుకలు జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వసంత రుతువు పంటకోత సీజన్(మార్చి - ఏప్రిల్)లో జరిగే ఈ వేడుకల్లో 18 గ్రామాల ప్రజలు పాల్గొంటున్నారు. తాటకిని వధించేందుకు ఏకంగా గుర్రాలు, ఏనుగులపై దూసుకొస్తున్నారు. తొలినాళ్లలో ఈ వేడుకలు నెల రోజులు జరిగేవి. ఇప్పుడీ ఉత్సవాలను 3 రోజులే నిర్వహిస్తున్నారు. ఇంతకీ ఎక్కడ 18 గ్రామాల ప్రజలు ఈ వేడుకల్లో ఎందుకు పాల్గొంటున్నారు? ఈ ఉత్సవాల్లో తాటకి వధ ఎలా జరుగుతుంది? ఈ కథనంలో తెలుసుకుందాం. తాటకి వధ ఉత్సవాలు ఇలా మొదలయ్యాయిమధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఛతర్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి 34 కిలోమీటర్ల దూరంలో గరౌలి గ్రామం ఉంది. బ్రిటీష్ పాలనా కాలంలో ఇదొక రాచరిక సంస్థానంగా ఉండేది. 19వ శతాబ్దంలో దీని తొలి పాలకుడిగా దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ బాధ్యతలు చేపట్టారు. గరౌలి సంస్థానం పరిధిలో 18 గ్రామాలు ఉండేవి. వాటి పేర్లు పుత్రయ, పచ్వారా, కుల్బారా, అకార్టోల్, గంజ్ కరారా, రాణిపుర, భడియాపుర గరౌలి, సలక్, వాంచోర్, భటేరా, అమన్‌పుర, రిచారా, సిలార్‌పూర్, సటోరా, పడ్రియా, కనేరా, నౌగావ్, కిరత్‌పుర. అప్పట్లో ఈ అన్ని గ్రామాల్లో భూస్వాములు ఉండేవారు. వీళ్లు ఏటా పంటకోత సీజన్ (మార్చి - ఏప్రిల్)లో స్థానిక రైతుల నుంచి పన్నులను వసూలు చేసేవారు. ఈ పన్నులను దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్‌కు చెల్లించేందుకు 18 గ్రామాల భూస్వాములు గరౌలి గ్రామానికి వచ్చేవారు. ఈ భూస్వాములను ఆనందింపజేసేందుకు దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ తాటకి వధ ఉత్సవాలను ప్రారంభించారు. అప్పట్లో నెల రోజుల పాటు ఈ వేడుకలు జరిగేవి. భూస్వాములతో పాటు రైతులు కూడా పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాలను చూసేందుకు వచ్చేవారు. తాటకిని వధించే భూస్వాములకు దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ బహుమతులు ఇచ్చేవారు. తాటకి వధ ఉత్సవాల్లో గుర్రాలు నాటి నుంచి నేటి దాకాచరిత్రకారుడు శంకర్ లాల్ సోని కథనం ప్రకారం, నాటి నుంచి నేటిదాకా గరౌలి గ్రామంలో ఏటా తాటకి వధ ఉత్సవాలు జరుగుతున్నాయి. పంట చేతికొచ్చిన వేళ 18 గ్రామాల రైతులు ఆనందోత్సాహాలతో ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. పాత సంప్రదాయాల ప్రకారం తలపాగా, గంచా, కండువాలను ధరించి గుర్రాలు, ఏనుగులపై కూర్చొని మరీ భారీ తాటకి ప్రతిమను వెంటాడి వేటాడి వధిస్తున్నారు. తాటకిని వధించే వారికి బహుమతిని ప్రదానం చేస్తున్నారు. అనంతరం శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతామాత శకటాలను ప్రదర్శనగా తాటకి వధ జరిగిన ప్రదేశానికి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. బ్యాండ్, డీజే, పోలీసు భద్రత నడుమ ఈ ఉత్సవాలు జరుగుతాయి. తాటకి వధ ఉత్సవాల్లో ఏనుగు బందోబస్తు నడుమ వేడుకలు'ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొంటారు. 3 రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయి. అందుకే మేం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తాం. ఏటా ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి' అని నౌగావ్ ఎస్‌డీఓపీ అమిత్ మెష్రామ్ తెలిపారు. ఎవరీ తాటకి రామాయణంలోని బాలకాండలో తాటకి వధ అనేది ఒక ప్రధాన ఘట్టం. ఆమె సుకేతుని కుమార్తె. మారీచుడి తల్లి. సుందుడు అనే రాక్షసుడి భార్య. తాటకిని అగస్త్య మహర్షి నరమాంస భక్షక రాక్షసిగా మారమని శపించారు. ఈ రాక్షసిని శ్రీరాముడు సంహరించడం మహర్షులకు ధైర్యాన్ని ఇచ్చింది.

## కొత్తగా పెండ్లయినోళ్లు శివుని గుడికి తొందరగా వెళ్లొద్దట..! ఎందుకో తెలుసా..?



శివ పార్వతుల బంధం చాలా ప్రత్యేకమైనది. కొంతమంది శివుడిని ప్రేమకు చిహ్నంగా చూస్తారు. ఆయన దివ్యమైన తపస్సు, సాధనతో సమానంగా పార్వతి ప్రేమను గౌరవించిన తీరు కారణంగా ఇది గుర్తింపు పొందింది. కానీ అదే సమయంలో మరికొంతమంది కొత్తగా పెళ్లైన జంటలు శివుడిని దర్శించకూడదని అంటారు. శివుడు పార్వతిని వివాహం చేసుకున్నా.. ఎక్కువగా తపస్సులో ఉండేవారు. ఆయన జీవితం తరచూ ఏకాంతంలో గడిచేది. అందుకే శివుడిని దర్శించే జంటలు కూడా తనలా ఏకాంతంలో ఉండే పరిస్థితిని ఎదుర్కోవచ్చని భావిస్తున్నారు. ఈ నమ్మకం ప్రకారం పెళ్లైన వెంటనే శివుడిని దర్శించడం వల్ల సంసార జీవితంలో ఒంటరితన భావనలు మొదలవుతాయని చెబుతారు. కొంతమంది కొత్తగా పెళ్లైన దంపతులు హనీమూన్ కు మతపరమైన ప్రదేశాలను ఎంచుకుంటారు. కానీ వాస్తవానికి హనీమూన్ అనేది దంపతులు తమ మధ్య సాన్నిహిత్యం పెంపొందించుకునే ప్రత్యేక సమయం. అలాంటి సమయంలో దేవాలయాల వంటి పవిత్రమైన స్థలాలకు వెళ్లడం అనేది శుభసూచకంగా పరిగణించబడదు. ముఖ్యంగా శివాలయానికి ఈ సమయంలో వెళ్లకూడదన్న నమ్మకం కొన్ని చోట్ల ప్రాచుర్యంలో ఉంది. ఎందుకంటే ఆ వాతావరణం శాంతిగా, భక్తి భావంతో ఉండేలా ఉండాలని భావిస్తారు. పురాణాల ప్రకారం శివలింగం పరమశివుని శక్తి స్వరూపంగా భావించబడుతుంది. దాన్ని స్పృశించడం వల్ల శుభ ఫలితాలు లభిస్తాయనే నమ్మకం ఉంది. అయితే కొత్తగా పెళ్లైన వధూవరులు ఈ సమయంలో శివలింగాన్ని తాకకూడదని చెప్పబడుతుంది. శివలింగం స్థానంలో పార్వతీ దేవిని పూజించడం శుభకార్యంగా పరిగణించబడుతుంది. ఇది దంపతుల మధ్య సఖ్యతను పెంచి వారి దాంపత్య జీవితం సుఖంగా సాగేందుకు సహాయపడుతుందని విశ్వసిస్తారు. పెళ్లైన వెంటనే పార్వతి దేవిని పూజించడం శుభప్రదమని అనేక పురాణాలు, గ్రంథాలు సూచిస్తున్నాయి. ఆమె కరుణ, శాంతి, ఐశ్వర్యం, సంతోషం వంటి శక్తుల ప్రతిరూపంగా భావించబడుతుంది. పార్వతీ దేవిని భక్తితో పూజించడం ద్వారా దాంపత్య జీవితం ప్రేమతో పరిపూర్ణంగా మారుతుందనే విశ్వాసం ఉంది. అందువల్ల కొత్తగా పెళ్లైన దంపతులు ఆమెను ఆరాధించడం ద్వారా శుభారంభంతో జీవితం ప్రారంభించవచ్చు. పెళ్లైన కొత్త జంటలు శివుడిని దర్శించకూడదన్న నమ్మకం పూర్వీకుల విశ్వాసాలపై ఆధారపడినదే. శివుడిపై భక్తి భావం నిలుపుకుంటూనే.. జీవితం ప్రారంభంలో పవిత్రతకు ప్రాధాన్యత ఇచ్చే ఉద్దేశంతో పార్వతి దేవిని పూజించడం శుభప్రదంగా భావించబడుతుంది.

## ఇంట్లో ఇలా ఉంటే భార్యాభర్తల మధ్య గొడవలు అవుతాయట.. ఎందుకో తెలుసా..?



వంటగది అనేది కేవలం భోజన తయారీ స్థలం మాత్రమే కాదు. ఇది కుటుంబ ఆరోగ్యం, శాంతి, బంధాలకు కేంద్రబిందువుగా పని చేస్తుంది. వాస్తు నియమాల ప్రకారం వంటగదిని ఉంచితే ఇంట్లో శుభ శక్తులు ప్రవహిస్తాయి. లేకపోతే నెగటివ్ ఎనర్జీ ఏర్పడి సంబంధాల్లో కలహాలు రావచ్చు. ఇంటి శక్తి సరైన మార్గంలో ప్రవహించాలంటే వాస్తు నియమాలు చాలా అవసరం. వంటగది అనేది కేవలం ఆహారం తయారు చేసే చోటు కాదు. ఇది కుటుంబ ఆరోగ్యం, సంబంధాల బలానికి కేంద్రంగా నిలుస్తుంది. వంట చేసే స్థలం, దిశ, ఉపయోగించే వస్తువుల శుభ్రత ఇవన్నీ జీవితంలో శాంతిని కలిగించడంలో సహాయపడతాయి. వాస్తు ప్రకారం వంట చేసే పాన్ సరైన స్థితిలో లేకపోతే లేదా తప్పుడు దిశలో ఉంచితే అది భార్యాభర్తల మధ్య కలహాలకు దారితీస్తుంది. మసి పట్టిన పాన్, విరిగిన పాత్రలు, కాలిపోయిన గిన్నెలు వంటగదిలో ఉండకూడదు. ఇవి ఆరోగ్యంపైనే కాకుండా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. వంటగదిలో వాడని పాత పాన్ లేదా విరిగిన పాత్రలు ఉండటం మంచిది కాదు. ఈ పాత్రలు ప్రతికూల శక్తిని ఆకర్షిస్తాయి. దాంతో కుటుంబంలో అపార్థాలు, నమ్మక లోపాలు ఏర్పడతాయి. అటువంటి వస్తువులు వంటగదిలో ఉంటే వెంటనే తీసివేయాలి. తాజా, శుభ్రంగా ఉండే పాత్రలే వాడాలి. వంట చేసే స్థలం శుభ్రంగా ఉండకపోతే కుటుంబ సంబంధాల్లో కలతలు వస్తాయి. నూనె, మసి పట్టిన పాత్రలు ప్రతికూల భావాలను కలిగిస్తాయి. వంటగది చక్కగా, శుభ్రంగా ఉంటే అక్కడ నుంచి సానుకూల శక్తి వెలువడుతుంది. ఇది ఇంట్లో ఆనందకరమైన వాతావరణాన్ని తీసుకువస్తుంది. ఆహారం తయారు చేసేటప్పుడు మనసు ప్రశాంతంగా ఉండాలి. వంట చేసే సమయంలో మన భావనలు ఆహారంలో కలుస్తాయి. మనసు కోపంగా ఉంటే.. ఆ ఆహారం తినే వాళ్లపై దుష్ప్రభావం చూపుతుంది. ప్రేమగా, శాంతిగా వంట చేస్తే ఆ ఆహారం కుటుంబానికి ఆనందాన్ని ఇస్తుంది. వాస్తు ప్రకారం వోక్ లేదా పెనాన్ని తప్పుడు దిశలో ఉంచడం, మురికిగా వాడడం లేదా కోపంతో వాడటం సంసార జీవితం మీద ప్రభావం చూపుతుంది. ఇది భార్యాభర్తల మధ్య వాదనలు, ఉద్రిక్తత తీసుకురాగలదు. కానీ వాస్తు నియమాల ప్రకారం వాడితే అదే వోక్ ఆనందానికి మార్గం అవుతుంది. ఇలా చిన్న చిన్న వాస్తు మార్గదర్శకాలను పాటించండం వల్ల కుటుంబంలో శాంతిని తీసుకురాగలదు.

## ఓర్పుకు నిదర్శనం ఈ జంతువు.. దీని జీవిత రహస్యం మీకు తెలుసా..?



మన జీవితం సహనంతో ఒక పద్ధతి ప్రకారం సాగాలంటే కొన్ని జంతువుల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. గాడిద ను మనం చిన్న చూపు చూసినా .. దాని జీవించే విధానం, దాని ప్రవర్తన మనకు ఎన్నో విషయాలను తెలియజేస్తుంది. గాడిద అనే మాటను కొందరు ఎగతాళి చేయడానికి వాడుతుంటారు. గాడిదకు కర్పూరం వాసన తెలుసా..? లాంటి సామెతలు అందుకే పుట్టాయి. కానీ నిజానికి ఇవన్నీ గాడిద నిజమైన స్వభావానికి చాలా దూరంగా ఉంటాయి. మనం గాడిదను ఎంత తక్కువగా మాట్లాడినా.. దాని గొప్ప లక్షణాల గురించి మనకు చాలా తక్కువ తెలుసు. గాడిదలు కష్టపడే జంతువులు. ఇవి తెలివిగలవిగా కూడా ఉంటాయి. వాటికి ఓపిక ఎక్కువగా ఉంటుంది. అవి తమ దారిలో అడ్డంకులు గుర్తించగలవు. అవసరమైతే మార్గాన్ని మార్చుకుని సమస్యను పరిష్కరించగలవు. ఇవి ప్రయాణంలో సమస్యలపై స్వతహాగా పరిష్కారం కనుగొనగలవు. గాడిదలు మానవ అభివృద్ధికి తోడుగా పనిచేసే జంతువులలో ఒకటి. ఇవి బలమైన కాళ్లతో భారాన్ని మోయగలవు. ఇవి చిన్నగా కనిపించినా చాలా బలం ఉంటుంది. గాడిదలు ఎక్కువ తినకపోయినా.. ఎక్కువ పని చేస్తాయి. వీటిపై ఎక్కువ బరువును మోపవచ్చు. గాడిద శాస్త్రీయ నామం ఈక్వస్ అసినస్. ప్రపంచంలో దాదాపు 40 రకాల గాడిదలు ఉన్నాయి. వాటి ముఖం మీద ముక్కు దగ్గర తెల్లగా ఉంటుంది. గాడిదలు సుమారు 90 నుంచి 140 సెంటీమీటర్ల వరకు పెరుగుతాయి. ఇవి దాదాపు 27 నుంచి 40 సంవత్సరాల వరకు బతకగలవు. ఇవి చేసే హీ హా అనే శబ్దం చాలా ప్రత్యేకమైనది. గాడిదలు బాగా ఎక్కువ శబ్దం చేసే జంతువుల్లో ఒకటి. యంత్రాలు లేని రోజుల్లో గాడిదలను ప్రయాణించడానికి, బరువులు మోయడానికి ఉపయోగించేవారు. పొలం పనులకు, బండ్లు లాగడానికి, నీళ్లు తీసుకురావడానికి, ఇటుకలు లాంటి నిర్మాణ సామాగ్రిని ఒక చోటు నుంచి ఇంకో చోటుకు తరలించడానికి ఇవి చాలా ఉపయోగపడేవి. రోమన్లు గాడిద పాలను మందుగా వాడేవారు. ఇంగ్లాండ్‌లో కొన్ని ప్రాంతాల్లో అయితే చిన్న పిల్లలకు తల్లి పాల బదులుగా గాడిద పాలను ఇచ్చేవారు. గాడిద తన ముందున్న నేలను వెనకున్న బరువును సరిగ్గా చూసుకొని తాను కింద పడకుండా బ్యాలెన్స్ చేసుకుంటుంది. ఇవి చాలా బలంగా ఉంటాయి. మన దేశంలో చేసిన ఒక పరిశోధన ప్రకారం గాడిదలు తమ బరువు కంటే రెండు రెట్లు ఎక్కువ బరువును కూడా మోయగలవు. బండ్లు లాగడంలో కూడా ఇవి చాలా బాగా ఆరితేరినవి. గాడిద పాలు పోషకాలు కలిగి ఉంటాయి. ఆరోగ్యానికి కూడా మంచిది. కొన్ని రోగాలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. అందుకే వాటిని ఎక్కువ ధరకు అమ్ముతారు. గాడిదలు మనకు ఓర్పు, శాంతి, క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం వంటి విలువలను నేర్పిస్తాయి.

## ఈ 10 వస్తువులు ఇతరులకు అస్సలు ఇవ్వకండి.. ఇస్తే ఏమౌతుందో తెలుసా..?



మన జీవితంలో కొన్ని వస్తువులు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఇవి శక్తిని, అదృష్టాన్ని సూచిస్తాయి. అలాంటి వస్తువులను వేరొకరికి ఇవ్వడం వల్ల ఆ శక్తి మన నుండి పోతుందని నమ్మకం ఉంది. ఇది సంప్రదాయం మాత్రమే కాదు.. అనుభవంతో కూడిన జీవన జ్ఞానం. ఇప్పుడు అలాంటి 10 ముఖ్యమైన వస్తువుల గురించి తెలుసుకుందాం.

సింధూరం

సింధూరం ఒక వివాహిత స్త్రీకి గుర్తు. ఇది ఆమె సంసారానికి రక్షణగా భావించబడుతుంది. సింధూరాన్ని వేరొకరికి ఇవ్వడం వల్ల ఆమె వైవాహిక జీవితంలో కలహాలు లేదా దురదృష్టం వచ్చేందుకు అవకాశం ఉందని నమ్మకం ఉంది.

**మిగిలిపోయిన ఆహారం**

తినకుండా మిగిలిన ఆహారాన్ని వేరొకరికి ఇవ్వడం అనాగరికంగా భావించబడుతుంది. ఇది ఆరోగ్య సమస్యలతో పాటు ప్రతికూల శక్తులు ఇంట్లోకి రావడానికి కారణమవుతుందని చెప్పబడుతుంది.

**చీపుర్లు, శుభ్రత వస్తువులు**

చీపురును లక్ష్మిని సూచించే వస్తువుగా పరిగణిస్తారు. దానిని వేరొకరికి ఇవ్వడం డబ్బు నష్టానికి దారి తీస్తుంది. అలాగే ఇంట్లో శాంతి తగ్గిపోవచ్చు.

**చిరిగిన బట్టలు**

వాడిన, పాడైపోయిన బట్టలను ఇతరులకు ఇవ్వడం మంచిది కాదు. ముఖ్యంగా లోదుస్తులు, నైట్ డ్రెస్ వంటివి పూర్తిగా వ్యక్తిగతమైనవి. ఇవి ఇవ్వడం వల్ల మన శక్తి బదిలీ అవుతుందని నమ్మకం ఉంది.

**వాచ్, కర్చీఫ్**

వాచ్ సమయాన్ని తెలియజేస్తుంది. దాన్ని వేరే వాళ్లకు ఇస్తే మన జీవిత గమనంలో మార్పులు వస్తాయని నమ్ముతారు. కర్చీఫ్ మనలోని బాధలు, సంతోషాలను సూచిస్తుంది. వీటిని ఇతరులకు ఇవ్వడం వల్ల బంధాలు బలహీనపడే అవకాశం ఉందని భావిస్తారు.

**బూట్లు, చెప్పులు, కాలి మెట్టలు**

బూట్లు, చెప్పులు అపవిత్రంగా భావిస్తారు. ఇవి పంచడం శుభకరం కాదు. అలాగే కాలి మెట్టలు స్త్రీకి గృహస్థ జీవితం గుర్తు. ఇవి పంచడం చెడ్డ ఫలితాలకు దారి తీయవచ్చు.

**గాజులుజి**

గాజులు కూడా ఒక వివాహిత జీవితంలో శక్తికి సంకేతం. విరిగిన గాజులను వేరొకరికి ఇవ్వడం వల్ల దాంపత్య సంబంధాలలో విభేదాలు రావచ్చు.

**నవజాత శిశువు బట్టలు**

పుట్టిన బిడ్డ బట్టలు చాలా పవిత్రంగా భావిస్తారు. ఇవి సున్నితమైన శక్తిని కలిగి ఉంటాయి. వీటిని వేరొకరికి ఇవ్వడం వల్ల ఆ శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

**వివాహ దుస్తులు**

పెళ్లి వేళ ధరించే దుస్తులు జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. ఇవి శుభ శక్తిని కలిగి ఉంటాయని నమ్మకం. ఇవి పంచడం వల్ల ఆ శక్తి ఇతరులకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

**మంగళసూత్రం**

మంగళసూత్రం ఒక మహిళకు వివాహ బంధాన్ని సూచించే పవిత్ర చిహ్నం. ఇది ఆమె జీవితంలో భద్రత, శాంతి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ మంగళసూత్రాన్ని ఇతరులకు ఇవ్వడం అశుభంగా పరిగణించబడుతుంది. ఇది దాంపత్య జీవితంలో కలతలు తెచ్చే అవకాశం ఉంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త వహించడం వల్ల మన జీవితంలో శాంతి, ఆనందం నిలుస్తాయి.

## ఈ మూడు తప్పులను వదిలితేనే మనిషికి మోక్షం దొరుకుతుందట..!



శ్రీమద్ భగవద్గీతను కేవలం మత గ్రంథంగా కాదు.. మన జీవన విధానాన్ని మార్గనిర్దేశం చేసే అమూల్య గ్రంథంగా కూడా పరిగణిస్తారు. ఇందులో శ్రీకృష్ణుడు ఇచ్చిన బోధనలు ఈనాటి జీవితానికి కూడా అత్యంత ప్రాముఖ్యంగా వర్తిస్తాయి. గీతలో ఆయన మూడు ముఖ్యమైన దోషాలను పేర్కొన్నారు. ఇవి మన ఆత్మబలాన్ని తగ్గించి.. మనల్ని నరక మార్గంలోకి నడిపించే ప్రమాదం ఉందని చెప్పారు. భగవద్గీతలో కామం, కోపం, దురాశ అనే మూడు దోషాలు మనిషిని దిగజార్చే ద్వారాలుగా పేర్కొనబడ్డాయి. వీటి గురించి భగవద్గీత శ్లోకం (అధ్యాయం 16, శ్లోకం 21) ఇలా చెబుతుంది

**త్రివిధం నరకస్యేదం ద్వారం**

**నాశనమాత్మనః**

కామః క్రోధస్త లోభస్తస్మాదేతత్రయం త్యజేత్

అంటే ఈ మూడు దోషాలు (కామం, కోపం, దురాశ) నరకానికి తెరవబడే ద్వారాలే. కాబట్టి వీటిని వెంటనే వదిలేయాలి.

**కామం**

కామం అంటే సాధారణ కోరికలు ఎక్కువై, వాటిని ఎలాగైనా తీర్చుకోవాలనే బలమైన ఆలోచన కలగడం. ఈ కోరిక నెరవేరకపోతే మనసు లోతుల్లో అసంతృప్తి పెరుగుతుంది. ఆ అసంతృప్తి నుంచి మనిషి ఆత్మవిశ్వాసం కోల్పోతాడు. ఎప్పటికీ తీరని కోరికలు మనిషిని స్వార్థంతో నడిపిస్తాయి. స్వార్థం వల్ల ఇతరులకు హాని చేసే దిశగా అడుగులు వేస్తాడు. ఈ విధంగా కామం ఆత్మను కలుషితం చేస్తుంది.

**కోపం**

కోపం అనేది అంతరంగాన్ని కాల్చే అగ్ని. ఇది మొదట మనలోనే నాశనాన్ని ప్రారంభిస్తుంది. కోపంలో ఉన్న మనిషి సరైన నిర్ణయం తీసుకోలేడు. అతనికి నిజం, తప్పు మధ్య తేడా స్పష్టంగా కనిపించదు. కోపం వల్ల మన మాటల్లో కఠినత్వం, ద్వేషం పెరుగుతుంది. ఇది మన ఆధ్యాత్మిక జీవనంలో క్షీణతకు కారణమవుతుంది.

**దురాశజి**

దురాశతో ఉండే వ్యక్తికి ధనం ఎంత ఉన్నా సరిపోదు. అతనికి ఎప్పటికీ తృప్తి ఉండదు. ఇతరుల కంటే ధనం ఎక్కువగా కావాలని కోరుకుంటాడు. కొన్ని సందర్భాల్లో ధనం కోసం ధార్మిక పరిమితుల్ని దాటి పోతాడు. ఇది నెమ్మదిగా అతన్ని తప్పుడు మార్గాల్లోకి నడిపిస్తుంది. దురాశ వల్ల అతను పాపానికి లోనవుతాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పింది ఏంటంటే.. ఈ మూడు దోషాలను పూర్తిగా వదిలినపుడు మాత్రమే మనిషి మోక్షానికి చేరుకోగలడు. కామం, కోపం, దురాశను నియంత్రించడమే ఆత్మరక్షణకు మొదటి అడుగు. వీటిని నియంత్రించడం ద్వారా శాంతిని, లోతైన ఆనందాన్ని పొందవచ్చు. మన జీవితంలో భగవద్గీత బోధనలు పాటించడమే మన ఆత్మ అభివృద్ధికి సహాయపడుతుంది. ఈ మూడు దోషాల్ని పూర్తిగా వదిలి, ఆత్మ నియంత్రణతో జీవించాలంటే చక్కటి ఆలోచనలు, మంచి చర్యలు అవసరం. మనం ఈ మార్గంలో నడిచినప్పుడు జీవితం మంచి దిశలో నడుస్తుంది.

## దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్నారా.. ఈ మొక్కలతో చెక్ పెట్టవచ్చు అని తెలుసా..

ఏ సీజన్‌లో నైనా దోమల బెడద తప్పని సరి. ఈ దోమలు డెంగ్యూతో సహా ఇతర వ్యాధులను త్వరగా వ్యాపింపజేస్తాయి. దీంతో ఈ దోమల నుంచి రక్షించుకోవడానికి ఇంటి కిటికీలకు మేస్ లు వేసుకుంటారు. ఇంట్లో సాయత్రం అయితే చాలు గుడ్ నైట్ వంటి వాటిని ఉపయోగిస్తారు. అయితే దోమలు ఇంట్లో అడుగు పెట్టకుండా కొన్ని రకాల మొక్కలు పెంచుకోవచ్చు అని తెలుసా.. మీ ఇంటి చుట్టూ ఈ మొక్కలను నాటడం ద్వారా సహజంగా దోమలను వదిలించుకోవచ్చు. వర్షాకాలంలోనే కాదు..ప్రతి సీజన్‌లోనూ దోమల బెడద ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల అయితే చాలు దోమలు ఇళ్లలోకి ప్రవేశిస్తాయి. అవికుడితే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులబారిన పడాల్సి ఉంటుంది. ఇంట్లోకి వచ్చే ఈ దోమలను నియంత్రించడానికి కొంతమంది కాయిల్స్ , స్ప్రేలను కూడా ఉపయోగిస్తారు. అయితే ఈ రసాయనాలతో నిండిన ఉత్పత్తులు మన ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కనుక ఇంట్లో కొన్ని రకాల మొక్కలను పెంచుకోవడం వలన దోమల సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది . ఆ మొక్కలు ఏమిటో తెలుసుకుందాం..

**దోమలను వదిలించుకోవడానికి ఇంట్లో ఏ మొక్కలు పెంచాలంటే**

తులసి మొక్క: మీ ఇంటి చుట్టూ తులసి మొక్కలను పెంచుకోవడం వలన దోమల బెడద నుండి బయటపడవచ్చు. తులసి మొక్కకు ఆధ్యాత్మిక పరంగా ప్రాముఖ్యత కలిగినా దీనిలో అనేక ఔషధ గుణాలున్నాయి. తులసి మొక్క ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. అంతే కాదు తులసి మొక్క స్వచ్ఛమైన గాలిని కూడా ఇస్తుంది. దోమల ప్రమాదాల నుంచి కూడా మనల్ని రక్షిస్తాయి.

**ఇంట్లో ఎరుపురంగు పువ్వుల మొక్కలు పెంచడానికి వాస్తు నియమాలున్నాయి**



బంతి పువ్వుల మొక్కలు: బంతి పువ్వుల మొక్కలు , పువ్వులు చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని ఇంట్లో పెంచుకోవడం వలన ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా, దోమల బెడదను కూడా నియంత్రిస్తుంది. అవును దోమలు బంతి పువ్వుల వాసనను ఇష్టపడవు . టికి దూరంగా ఉండాలని కోరుకుంటాయి. అందువల్ల ఈ మొక్కలను మీ ఇంటి దగ్గర పెంచుకోవడం వల్ల దోమలను సులభంగా వదిలించుకోవచ్చు. రోజ్మేరీ మొక్క: రోజ్మేరీ మొక్కలను సహజ దోమల నివారిణిగా పరిగణిస్తారు. దోమలు వీటి ఘాటు వాసనను ఇష్టపడవు. కనుక ఈ మొక్కలను ఇంటి చుట్టూ పెంచుకోవడం వలన మీరు దోమల బెడద నుండి సులభంగా బయటపడవచ్చు. నిమ్మ గడ్డి: దోమలను తరిమికొట్టడంలో నిమ్మ గడ్డి కూడా చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. అవును, దోమలకు ఈ మొక్క వాసన నచ్చదు. దాని వాసన దోమలను చికాకుపెడుతుంది. కనుక ఈ మొక్కను మీ ఇంటి ముందు లేదా మీ బాల్కనీలో పెంచుకుంటే మీరు దోమల ముప్పును తగ్గించవచ్చు. పుదీనా మొక్క: పుదీనా ఆకులు అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. అదేవిధంగా ఈ పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుకుంటే దోమల బెడద నుంచి కూడా బయటపడవచ్చు. ఈ మొక్క సువాసన దోమలు, కీటకాలు , సాలెపురుగులను దూరంగా ఉంచుతుంది. మీకు కావాలంటే ఇంట్లో పుదీనా నూనెను కూడా స్ప్రే చేసుకోవచ్చు. లావెండర్ మొక్క: లావెండర్ ముఖ్యమైన నూనె మానసిక ఆరోగ్యానికి చాలా మంచిదని భావిస్తారు. అదేవిధంగా లావెండర్ మొక్క సువాసన కూడా దోమలను తరిమికొట్టడంలో సహాయపడుతుంది. మీ ఇంటి ప్రాంగణంలో, బాల్కనీలో లేదా కిటికీ దగ్గర లావెండర్ మొక్కను ఉంచడం ద్వారా దోమలు మీ ఇంట్లోకి రాకుండా నిరోధించవచ్చు.

## మలబద్ధకం సమస్యతో ఇబ్బంది పడుతున్నారా.. ఆయుర్వేదంలో బెస్ట్ మెడిసిన్ ఉందని తెలుసా..



ప్రస్తుతం చాలా మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మలబద్ధకం ప్రజలను ఇబ్బంది పెడుతుంది. ఒకసారి మలబద్ధకం బారిన పడితే అది ఎక్కువ కాలం తగ్గదు. మలబద్ధకం విషయంలో.. కొన్ని ఆయుర్వేద మందులను తీసుకోవచ్చు. వీటిని ఉపయోగించడం వలన మలబద్ధక సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం ఎక్కువ మంది ప్రజలు చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మలబద్ధకంతో బాధపడుతున్నారు. కడుపు శుభ్రం కాకపోతే రోజంతా నీరసం, సోమరితనం, చిరాకు ఉంటాయి. మలబద్ధకం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. దీనితో మలబద్ధకంతో బాధపడేవారు తరచుగా వైద్య చికిత్స తీసుకుంటున్నారు. మందు తీసుకున్న సమయంలో ఈ సమస్య కొంతవరకు తగ్గుతుంది. మందులు ఆపివేసినప్పుడు మళ్ళీ మొదలవుతుంది. అయితే ఈ మలబద్ధకం సమస్యకు బెస్ట్ సొల్యూషన్ ఆయుర్వేదం అని నిపుణులు చెబుతున్నారు. ఎవరైనా మలబద్ధకంతో బాధపడుతుంటే ఈ ఆయుర్వేద మందులు తీసుకోవచ్చు. మలబద్ధకం ఒక తీవ్రమైన సమస్య. అయితే ఎక్కువ మందికి ఈ సమస్య తప్పుడు ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా వస్తుంది. ఆలస్యంగా నిద్రపోవడం, ఆలస్యంగా మేల్కొనడం ఈ సమస్యకు మూల కారణం. మలబద్ధకంలో అనేక రకాలు ఉన్నాయి. సాధారణంగా మనకు దానిలో ఒక రకం మాత్రమే తెలుసు. టాయిలెట్ నుంచి వచ్చిన తర్వాత కూడా కడుపు శుభ్రంగా లేదు. ఒకటి కంటే ఎక్కువసార్లు ఫ్రెష్ అప్ అవ్వాల్సి ఉన్నా%ా% టాయిలెట్‌లో ఎక్కువ సమయం గడపడం కూడా మలబద్ధకానికి సంకేతం. ఇలాంటి ఆరోగ్య సమస్యకు చక్కటి పరిష్కారం ఆయుర్వేద మేదిసిన్స్. అవి మలబద్ధకం సమస్యకు చక్కటి ఉపశమనం కలిగిస్తాయి.

**ఆయుర్వేద వైద్యం**

ఎలాంటి మలబద్ధకం నుంచి అయినా ఉపశమనం పొందడానికైనా ఆయుర్వేద మందులను తీసుకోవచ్చు. వీటిలో త్రిఫల, ఇసబ్‌గోల్, అలోవెరా జ్యూస్, అభయారిష్ట కూడా ఉన్నాయి. త్రిఫల చూర్ణంని ఉసిరి, కరక్కాయ, తానికాయల వంటి మూలికల మిశ్రమం. ఇసబ్‌గోల్ ఒక సహజ ఫైబర్ మూలం. ఇది జీర్ణ ప్రక్రియ సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది. కలబంద రసంలో ఫైబర్, ఎంజైములు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అభయారిష్ట దీర్ఘకాలిక మలబద్ధకం చికిత్సకు ఉపయోగిస్తారు.

**రానున్న 25 ఏళ్లలో 44 కోట్ల మంది ఈ వ్యాధిన పడే ఛాన్స్..**

దాబా స్టైల్‌లో కాజు పనీర్ కర్రీని ఇంట్లోనే చేసుకోండి.. రెసిపీ

ఇంట్లో ఎరుపురంగు పువ్వుల మొక్కలు పెంచడానికి వాస్తు నియమాలున్నాయి

స్త్రీ, పురుషులలో కుడి కన్ను అదిరితే శుభమా? అశుభమా.. తెలుసుకోండి

**ఈ మందు ఎలా తీసుకోవాలి**

రాత్రి సమయంలో ఒక చెంచా త్రిఫల పొడిని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవడం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. ఇసాబ్‌గోల్‌ను రాత్రిపూట గోరువెచ్చని నీరు లేదా పాలతో కలిపి ఒకటి లేదా అర టీస్పూన్ కూడా తీసుకోవచ్చు. ఉదయం పరగడుపున కలబంద రసం తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. అభ్యరిష్టను డాక్టర్ సలహా మేరకు తీసుకోవాలి. దీనితో పాటు, క్యారెట్, బీట్‌రూట్, సొరకాయ, దానిమ్మ , ఆపిల్ మిశ్రమ రసం తాగడం వల్ల కూడా మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. దీన్ని రోజులో ఎప్పుడైనా తీసుకోవచ్చు, అయితే ఉదయం తీసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

## మారిన అలవాట్లు, జీవన శైలితో పొంచి ఉన్న ముప్పు.. రానున్న 25 ఏళ్లలో 44 కోట్ల మంది ఈ వ్యాధిన పడే ఛాన్స్



చెడు జీవనశైలి కారణంగా.. దేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. దీనిని ఇప్పుడు ఆపకపోతే రానున్న రెండు దశాబ్దాలలో దేశ పౌరులలో మూడింట ఒక వంతు మంది ఈ వ్యాధికి బలైపోవచ్చు. ఇది కేవలం ఒక వ్యాధి మాత్రమే కాదు.. అనేక వ్యాధులకు తల్లి కూడా. నిపుణులు ఈ వ్యాధిని సునామీ లాంటిదని అభివర్ణించారు. ఈ వ్యాధిని ఇప్పుడే నియంత్రించకపోతే.. భవిష్యత్తులో దేశ ఆరోగ్య నిర్మాణం, ఆర్థిక ఉత్పాదకత తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. మారిన జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. పిల్లలు కూడా దీనికి బలైపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా అనేక ఇతర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ వ్యాధి సునామీగా మారి రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశాన్ని తాకవచ్చు. భారతదేశంలో నివసిస్తున్న 35 శాతం కంటే ఎక్కువ మంది ఈ వ్యాధికి బలైపోయే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఏమిటి? ఇది ఎందుకు అంత వేగంగా వ్యాపిస్తోంది? ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ఏం చేయాలి? నిపుణుల సలహా ఏమిటో తెలుసుకుందాం.. ఈ వ్యాధి అనేక ఇతర వ్యాధులకు మూలకారణంగా చెప్పబడింది. ఈ వ్యాధి టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం, హార్మోన్ల రుగ్మతలు, పిల్లలను కనలేకపోవడం, కొన్ని క్యాన్సర్లు వంటి వ్యాధుల పెరుగుదలకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. ఈ వ్యాధి దేశంలో ఒక సంక్షోభంగా మారుతోంది. ఈ వ్యాధికి ప్రధాన కారణం చెడు జీవనశైలి, మారిన దినచర్య, ఆహారపు అలవాట్లు. ఈ వ్యాధి పిల్లలను కూడా ప్రభావితం చేస్తుంది.

# బంగారం ధరలు పెరిగితే వెంటనే అమ్మేసుకోండి

## కీలక హెచ్చరిక జారీ చేస్తున్న ఆర్థిక నిపుణులు..

ప్రస్తుతం బంగారం మార్కెట్ ఒక క్లిష్టమైన, అనిశ్చిత స్థితిలో కొనసాగుతోంది. అంతర్జాతీయంగా అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారం ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులకు ప్రధాన కారణమవుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ధరలు ప్రస్తుతం కొంత తగ్గుదల ధోరణిలో ఉండి, ఒక సర్దుబాటు ప్రక్రియ గుండా వెళ్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో త్వరలోనే ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు తగ్గకపోవడం, ఇరాన్ ఈ ప్రతిపాదనలను తోసిపుచ్చడం ఇన్వెస్టర్లలో ఆందోళనను పెంచుతోంది.సాంకేతికంగా పరిశీలిస్తే.. ఎంసీఎక్స్ (వీజశ) మార్కెట్‌లో బంగారం ధరలు ప్రస్తుతం కొన్ని కీలకమైన స్థాయిల మధ్య ఊగిసలాడుతున్నాయి. ఎగువ స్థాయిలో రూ. 1,48,500 నుండి రూ. 1,50,000 వరకు గట్టి నిరోధం కనిపిస్తోంది. ధరలు ఈ రూ. 1,50,000 మార్కును దాటి పైన స్థిరపడితేనే మళ్లీ పాత గరిష్టాల దిశగా దూసుకుపోయే అవకాశం ఉంటుంది.లేనిపక్షంలో అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు. ఒకవేళ ధరలు తగ్గడం ప్రారంభిస్తే.. దిగువన రూ. 1,36,000 వద్ద బలమైన మద్దతు లభిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఈ స్థాయి కూడా దాటి కిందకు పడిపోతే, ధరలు రూ. 1,28,500 వరకు క్షీణించే ప్రమాదం ఉంది. ఇది ఇన్వెస్టర్లు నిశితంగా గమనించాల్సిన అంశమని చెబుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ వ్యూహం విషయానికి వస్తే.. నిపుణులు 'సెల్-ఆన్-రైజ్' (ధరలు పెరిగినప్పుడు అమ్మడం) పద్ధతిని అనుసరించాలని సూచిస్తున్నారు. బలమైన అమెరికా డాలర్, పెరుగుతున్న ట్రెజరీ బాండ్ల రాబడులు బంగారం ధరలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. దీనివల్ల బంగారం లాభాలు పరిమితమవుతున్నాయి. అయితే, గత నెల రోజుల్లో ధరలు సుమారు 15 శాతం మేర తగ్గడం వల్ల, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది ఒక మంచి కొనుగోలు అవకాశంగా కూడా కనిపిస్తోంది. ఏదేమైనా, ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా, చిన్న చిన్న మొత్తాల్లో విడతల వారీగా పెట్టుబడి పెట్టడం సురక్షితమని విశ్లేషకులు చెబుతున్నారు. భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు భారీగా పతనమైన బంగారం, వెండి ధరలురాబోయే రోజుల్లో విడుదలయ్యే అమెరికా ఉద్యోగ గణాంకాలు, వినియోగదారుల విశ్వాసానికి సంబంధించిన డేటా మార్కెట్ దిశను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. ఇరాన్ యుద్ధంపై వచ్చే తాజా వార్తలు మరియు హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతున్న



చమురు రవాణాపై నెలకొన్న ఆంక్షలు బంగారం ధరలను ప్రభావితం చేస్తూనే ఉంటాయి. కావున, ట్రేడర్లు అత్యంత అప్రమత్తంగా ఉండి, స్టాప్-లాస్ వంటి జాగ్రత్తలు తీసుకుంటూ లావాదేవీలు నిర్వహించడం ఉత్తమమని చెబుతున్నారు. అంతర్జాతీయ అనిశ్చితి కొనసాగుతున్నంత కాలం బంగారం ధరలలో అస్థిరత తప్పదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# ఇరాన్ యుద్ధంపై ట్రంప్ సంచలన ప్రకటన

## చారిత్రాత్మక ఒప్పందంపై ఏమన్నారంటే..

పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం 5వ వారానికి చేరుకుంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల ఫలితంగా అక్కడ 'పాలన మార్పు' సాధ్యమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ సంచలన ప్రకటన చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ పాత నాయకత్వం స్థానంలో ఇప్పుడు అత్యంత హేతుబద్ధంగా వ్యవహరించే కొత్త సమూహం వచ్చిందని, దీనివల్ల త్వరలోనే టెహ్రాన్‌తో ఒక చారిత్రాత్మక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఈ దౌత్యపరమైన ప్రకటనల వెనుక యుద్ధ తీవ్రత భయంకరంగానే కొనసాగుతోంది.గత నెల రోజులుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరగడంతో.. టెహ్రాన్, దాని పరిసర ప్రాంతాలు పూర్తిగా చీకటిలో మునిగిపోయాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ తన పొరుగు దేశాలైన కువైట్, సౌదీ అరేబియాపై క్షిపణి దాడులకు దిగింది. కువైట్‌లోని ఒక విద్యుత్ కేంద్రంపై జరిగిన దాడిలో ఒక భారతీయ కార్మికుడు మరణించడం విషాదకరం.అటు సౌదీ అరేబియా తమపైకి వచ్చిన ఐదు బాలిస్టిక్



క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. మరోవైపు, దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండగా, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళం స్థావరంపై జరిగిన దాడిలో ఒక సైనికుడు మరణించడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది.ఇరాన్ మా షరతులకు ఒప్పుకుంది..అణ్వాయుధాలు విడిచిపెడుతోంది..ట్రంప్ సంచలన ప్రకటన..ఇరాన్ మా షరతులకు ఒప్పుకుంది..అణ్వాయుధాలు విడిచిపెడుతోంది..ట్రంప్ సంచలన ప్రకటన..ఈ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ అమెరికాపై తీవ్ర విమర్శలు చేశారు. వాషింగ్టన్ ఒకవైపు శాంతి చర్చలంటూ మాయమాటలు చెబుతూనే, మరోవైపు రహస్యంగా భూతల దాడులకు ప్రణాళికలు రచిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా సైనికులు ఇరాన్ భూభాగంలోకి అడుగుపెడితే వారిని దహనం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు.ఈ యుద్ధం కారణంగా సామాన్య ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయి. ఎడతెరిపిలేని బాంబు దాడులతో టెహ్రాన్ నగరం మొత్తం కంపిస్తోందని, ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని అక్కడి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్థిక పరంగా ఈ యుద్ధం ప్రపంచానికి పెద్ద ముప్పుగా పరిణమించింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఇంధన మార్కెట్లు సంక్షోభంలో పడ్డాయి. దీని ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు 115 డాలర్లకు పైగా పెరగగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 100 డాలర్ల మార్కును దాటింది. ఇజ్రాయెల్ సైతం తన రక్షణ బడ్జెట్‌ను 45 బిలియన్ డాలర్లకు పెంచుతూ యుద్ధం దీర్ఘకాలం కొనసాగేలా సంకేతాలిచ్చింది.ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పాకిస్తాన్ మధ్యవర్తిగా చొరవ చూపుతోంది. ఇస్లామాబాద్‌లో సౌదీ, టర్కీ, ఈజిప్ట్ దేశాల విదేశాంగ మంత్రులతో చర్చలు జరిపిన పాకిస్తాన్, యుద్ధాన్ని ముగించేందుకు 15 సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించింది. అమెరికా మరియు ఇరాన్ రెండు దేశాలూ పాకిస్తాన్‌పై విశ్వాసం వ్యక్తం చేయడం కొంత సానుకూల అంశం. అయితే, ఒకవైపు చర్చలు జరుగుతున్నా, అమెరికా తన 'యూఎస్ఎస్ ట్రిపోలి' వంటి భారీ యుద్ధ నౌకలను మధ్యప్రాచ్యానికి పంపడం చూస్తుంటే, దౌత్యం విఫలమైతే భూతల దాడులకు కూడా వెనకాడబోమని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తున్నట్లు కనిపిస్తోంది.

# హోర్ముజ్ జలసంధిని దాటిన మరో రెండు భారత నౌకలు

## మరో మూడు షిప్పులు ఇంకా అక్కడే

దేశంలో గ్యాస్ సంక్షోభం నెలకొన్న వేళ గుడ్ న్యూస్.. భారతదేశానికి ఎల్‌పీజీ సరఫరా విషయంలో మరో కీలక అప్ డేట్ బయటకు వచ్చింది. దేశానికి దాదాపు ఒక రోజుకు సరిపడా వంటగ్యాస్‌ను తీసుకువెళ్తున్న భారత జెండా కలిగిన రెండు న్గా+ నౌకలు.. ఘర్షణలతో దెబ్బతిన్న హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి.రాబోయే రోజుల్లో భారతదేశానికి చేరతాయని భావిస్తున్నారు. బిడబ్ల్యు టివైఆర్, బిడబ్ల్యు ఇఎల్ఎం అనే ఈ నౌకలు సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీని రవాణా చేస్తున్నట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బిడబ్ల్యు టివైఆర్ మార్చి 31న ముంబైకి చేరనుండగా, బిడబ్ల్యు ఇఎల్ఎం ఏప్రిల్ 1న న్యూ మంగళూరుకు చేరుతుంది.ఇవి ఇటీవల విజయవంతంగా హోర్ముజ్ జలసంధి దాటి భారత జెండా నౌకల జాబితాలో చేరినవి. ప్రస్తుతం ఈ రవాణా మార్గంలో నాలుగు ట్యాంకర్లు ఇప్పటికే భద్రతగా దేశానికి చేరుకున్నాయి, మరో మూడు నౌకలు జలసంధి యొక్క పశ్చిమ భాగంలో ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంఘర్షణ కారణంగా ఏర్పడిన అంతరాయాల మధ్య, ఇరాన్ "శత్రుత్వం లేని" నౌకలను జలసంధి దాటడానికి అనుమతించింది.ఇటీవలి రోజుల్లో మరో నాలుగు భారత నౌకలు కూడా సురక్షిత ప్రాంతాలకు చేరినవి. పైన్ గ్యాస్, జగ్ వసంత్ ట్యాంకర్లు 92,600 టన్నుల ఎల్‌పీజీని మార్చి 26, 28 మధ్య భారత ఓడరేవులకు అందజేశాయి. ముందుగా, ఎం.టి. శివాలిక్, ఎం.టి. నందా దేవి ట్యాంకర్లు వరుసగా మార్చి 16, 17 తేదీలలో ముంద్రా, కాండ్లా ఓడరేవులకు చేరాయి. అదనంగా, ఖూజు నుండి 80,000 టన్నుల ముడి చమురును తీసుకువస్తున్న 'జగ్ లాడ్కి', ఒమన్ నుండి ఆఫ్రికాకు గ్యాసోలిన్ సరుకు తీసుకువెళ్తున్న 'జగ్ ప్రకాష్' కూడా సురక్షితంగా జలసంధి దాటాయి. నిలిపివేత..కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదేశాలునిలిపివేత..కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదేశాలుభారతదేశం దాదాపు 60 శాతం ఎల్‌పీజీ అవసరాలను దిగుమతులపై ఆధారపడే దేశం కావడంతో.. ఈ సరఫరాలు తీవ్రమైన వంటగ్యాస్ కొరతకు ఉపశమనం అందిస్తున్నాయి. గత సంవత్సరం దేశం 33.15 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగించింది. అందులో దాదాపు 90 శాతం దిగుమతులు పశ్చిమ ఆసియా నుంచి వచ్చాయి. హోర్ముజ్ ప్రాసారం సురక్షితంగా పనిచేస్తుండడంతో, భారత్ ఇతర ప్రత్యామ్నాయ సరఫరాదారుల నుండి కూడా ఎల్‌పీజీ రవాణా ప్రారంభించింది.ప్రస్తుతం జగ్ విక్రమ్, గ్రీన్ ఆశా, గ్రీన్ సాన్వి అనే మూడు ఎల్‌పీజీ ట్యాంకర్లు పశ్చిమ హోర్ముజ్ జలసంధిలో ఉన్నాయి.




మరో ఖాళీ నౌక లోడ్ అవుతోంది. సంఘర్షణ ప్రారంభ సమయంలో, ఆ ప్రాంతంలో 28 భారత నౌకలు ఉండగా, ఇప్పటివరకు ఎనిమిది సురక్షిత ప్రాంతాలకు తరలించబడ్డాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ 942 మంది భారతీయ నావికుల భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయం అందిస్తోంది. భారతదేశవ్యాప్తంగా ఓడరేవు కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయి, ఎటువంటి రద్దీ నమోదవ్వలేదని అధికారులు తెలిపారు.

# మధ్యతరగతి కష్టాలే నా సక్సెస్ సీక్రెట్!

## వైరల్ అవుతున్న బెంగళూరు యువతి స్టోరీ!

సాధారణంగా మనం ఎవరైనా సక్సెస్ అయ్యారంటే.. వారి వెనుక పెద్ద బ్యాక్ గ్రౌండ్ ఉందేమో అని అనుకుంటాం. కానీ, చాలా మంది విజయాల వెనుక నిశ్శబ్దంగా చేసిన త్యాగాలు, మధ్యతరగతి కష్టాలు దాగి ఉంటాయి. సరిగ్గా ఇలాంటి విషయాలనే గుర్తు చేసుకుంటూ బెంగళూరు కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ మీనల్ గోయల్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు వేలమంది హృదయాలను గెలుచుకుంటోంది.పాత ఫోటోలు తెచ్చిన జ్ఞాపకాలుమీనల్ గోయల్ ఇటీవల తన తల్లి బీరువా సర్దుతుండగా కొన్ని పాత ఫోటోలు కనిపించాయట. ఆ ఫోటోలు చూడగానే ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అప్పట్లో తన తల్లిదండ్రులు తమ కోసం ఎంతగా కష్టపడ్డారో, ఎన్ని త్యాగాలు చేశారో ఆమెకు అప్పుడు అర్థమైంది. "మాకు వారసత్వంగా పెద్దగా ఆస్తులేమీ రాలేదు.. కానీ మా అమ్మనాన్నలు మాకు ఇచ్చిన మద్దతు, మాపై ఉంచిన నమ్మకం కోట్లతో సమానం" అని ఆమె ఎంతో ఎమోషనల్ గా చెప్పుకొచ్చారు.మిడిల్ క్లాస్ కష్టాలే పెట్టుబడిమధ్యతరగతి కుటుంబాల్లో విలాసాలు ఉండకపోవచ్చు, కానీ బాధ్యతలు చాలా ఎక్కువగా ఉంటాయి. మీనల్ అభిప్రాయం ప్రకారం.. మధ్యతరగతి పిల్లల్లో ఒక రకమైన 'ఆకలి' ఉంటుంది. అది డబ్బు కోసం కాదు, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే తపన. తమకు ఎటువంటి బ్యాకప్ లేదని, సొంతంగానే ఎదగాలని వారికి తెలుసు. అందుకే వారు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటారు. కష్టపడి పైకి రావడంలోని కిక్కు మధ్యతరగతి పిల్లలకే బాగా తెలుస్తుందని ఆమె అన్నారు.ఆస్తి అంటే డబ్బు మాత్రమే కాదుచాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వలేకపోయామని బాధపడుతుంటారు. కానీ మీనల్ మాటల్లో చెప్పాలంటే.. పిల్లలకు ఇచ్చే సంస్కారం, ఓర్పు, పట్టుదల అనేవి ఏ ఆస్తికి తీసిపోవు. "నా దగ్గర ఖరీదైన వస్తువులు లేకపోవచ్చు, కానీ నా తల్లిదండ్రులు నా వెనుక ఉన్నారనే ధైర్యం నాకు పెద్ద సెక్యూరిటీ నెట్ లా పనిచేసింది. ఆ ధైర్యమే నన్ను జూా లాంటి కఠినమైన కోర్సును పూర్తి చేసేలా చేసింది" అని ఆమె వివరించారు.అడ్డంకులే అవకాశాలుగా..ఆర్థిక ఇబ్బందులు అనేవి ఎదుగుదలకు ఆటంకం కాదు, అవి ఒక కెటలిస్ట్ (ప్రేరకం) లా పనిచేస్తాయని మీనల్ అభిప్రాయపడ్డారు. వనరులు తక్కువగా ఉన్నప్పుడు మనం ఎలా సర్దుకోవాలో నేర్చుకుంటాం, ఓర్పుగా ఉండటం అలవాటు చేసుకుంటాం. ఈ లక్షణాలే జీవితంలో పెద్ద పెద్ద సవాళ్లు ఎదురైనప్పుడు మనల్ని నిలబెడతాయి. బెంగళూరు లాంటి నగరాల్లో కెరీర్ బిల్డ్ చేసుకోవాలంటే కేవలం తెలివితేటలు ఉంటే సరిపోదు, బలమైన సంకల్పం ఉండాలి.మొత్తానికి మీనల్ గోయల్ స్టోరీ మనకు చెప్పేది ఒక్కటే.. విజయం అనేది బ్యాంకు బ్యాలెన్స్ మీద ఆధారపడి ఉండదు. మన క్యారెక్టర్, మన పట్టుదల మీద ఆధారపడి ఉంటుంది. మీ చిన్నతనం సాధారణంగా గడిచినంత మాత్రాన మీ భవిష్యత్తు కూడా సాధారణంగా ఉండాలని రూల్ లేదు. ఆ సాధారణ జీవితమే మిమ్మల్ని అసాధారణ



వ్యక్తిగా మారుస్తుంది.

## అమెరికాలో ఛాయ్ వాలాగా మారిన భారత ఐటీ ఉద్యోగి

### రోజూ వారి సంపాదన చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



ఐటీ ఉద్యోగాలు ప్రస్తుత కాలంలో ఉద్యోగ భద్రతను అందించడం లేదు. ముఖ్యంగా ఈ టెక్నాలజీ యుగంలో జాబ్ అనేది దినదిన గండంగా మారింది. ఐటీ కార్మికులు నిరంతరం ఉద్యోగాల తొలగింపు బెదిరింపులకు గురవుతున్నారు. అమెరికా లాగా విదేశాలకు వెళ్లి ఐటీ ఉద్యోగాలు పొందగలిగే భారతీయుల పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంది. ఒకవైపు వీసా ఆంక్షలు, మరోవైపు కంపెనీలు అకస్మాత్తుగా కార్మికులను తొలగించడంతో ఉద్యోగి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పుడు మనం చెప్పుకోబోయే కథలో అమెరికాలో ఉద్యోగం కోల్పోయిన ఓ యువకుడు జీవితంలో సక్సెస్ ఎలా అయ్యాడు అని.. అవును అమెరికాలో పనిచేస్తున్న ఒక యువకుడు అకస్మాత్తుగా తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. అయితే జాబ్ పోయిందని బాధపడకుండా.. టీ స్టాల్ తెరవడం ద్వారా విజయం సాధించాడు. ఇప్పుడు అతని వీడియోలు సోషల్ మీడియాలో ప్రతిచోటా షేర్ అవుతున్నాయి.ఆ యువకుడి పేరే ప్రభాకర్ ప్రసాద్. అందరూ అతన్ని బీహార్ చాయ్ వాలా, చైగుయ్ అని పిలుస్తారు.చిన్న పట్టణంలో పేద కుటుంబంలో జన్మించిన ప్రభాకర్ ప్రసాద్ జీవితాన్ని కష్టాలతో ప్రారంభించాడు. శీతాకాలంలో వేడి కోసం పప్పు బస్తాల కిందపడ్డ నిద్ర, తల్లిదండ్రుల నిరంతర పోరాటం, ఆర్థిక ఇబ్బందులు ఇవన్నీ అతనికి ఎన్నో పాఠాలు నేర్పాయి. తండ్రి ఎన్నో వ్యాపార ప్రయత్నాలు చేసినప్పటికీ పెద్ద విజయం దొరకలేదు.అయినప్పటికీ ఆ తండ్రి కుమారుడికి విద్యను అందించడంలో ఎప్పుడూ రాజీ పడలేదు.అనుకోకుండా ఓ రోజు ఆయన సోదరుడి కిడ్నాప్ ప్రయత్నం వల్ల కుటుంబం భయంతో బీహార్ వదిలి భోపాల్‌కు వలసివచ్చింది. కొత్త నగరంలో, కొత్త పాఠశాలలో, ఇంగ్లీష్ పదాలు అర్థం కాకపోవడంతో తోటి విద్యార్థులు ఆతని ఇంగ్లీష్ ఉచ్చారణను చూసి నవ్వేవారు. అయినా అతను పట్టుదలతో ప్రతి రోజు కష్టపడి చదివాడు. చివరికి పరీక్షలో విజయం సాధించాడు. అడ్మిషన్ అతని జీవితం మార్చేసింది.డిగ్రీ పూర్తయిన తరువాత 2008లో మొదటి ఉద్యోగం సంపాదించాడు. కానీ టెక్ పనిలో హృదయం సంతోషం పొందలేకపోయింది. శారీరక వ్యాయామం, జిమ్, మోడలింగ్.. ఇలాంటి చిన్న ఆసక్తులు ఆయనలో ఉత్సాహం, ఆనందాన్ని తెచ్చాయి. ముంబైలో మోడలింగ్ ప్రయత్నాలు, లాంగ్ క్యూలు, చిన్న ఫ్లాట్స్ అన్ని ఓర్పుతో ఎదుర్కొన్నాడు.తర్వాత వీసా కోసం అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. వీసా రెండుసార్లు తిరస్కరించబడినా.. 2014లో అమెరికాలో అడుగుపెట్టగలిగాడు.

## లక్షల జీతం వదులుకొని ఐస్ క్రీం షాప్..!


### అప్పుడు నవ్వుకున్నవాళ్లే ఇప్పుడు మెచ్చుకుంటున్నారట!




జీవితంలో బాగా స్థిరపడటం అంటే ఏంటి ఒక మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో భారీ జీతం వచ్చే ఉద్యోగం, ఆఫీస్ కారు, అందమైన కుటుంబం.. ఇవే కదా మనందరం అనుకునేది. కానీ బెంగళూరు కు చెందిన ప్రదీప్ కన్నన్ మాత్రం దీనికి భిన్నంగా ఆలోచించారు. ఓరాకిల్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలో ఆపరేషన్స్ హెడ్‌గా చేస్తున్న వ్యక్తి.. అకస్మాత్తుగా తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఐస్ క్రీం అమ్ముతానంటే సమాజం ఎలా స్పందిస్తుంది? సరిగ్గా ప్రదీప్ విషయంలో కూడా అదే జరిగింది.అందరూ నవ్వారు.. కానీ ఆయన తగ్గలేదు2019 లో ప్రదీప్ తన సుఖవంతమైన ఉద్యోగాన్ని వదిలేయాలని నిర్ణయించుకున్నప్పుడు అందరూ ఆయనను చూసి నవ్వుకున్నారు. "అంతా సెటిల్ అయ్యాక ఈ ఐస్ క్రీం షాపులేంటి?" అని చాలా మంది ప్రశ్నించారు. కానీ, తనలో ఉన్న వ్యాపార తపన ప్రదీప్ ను ముందుకు నడిపించింది. బెంగళూరు వదిలి తన సొంత ఊరు కరూర్ (తమిళనాడు) వెళ్ళి 'ది ఫలూదా షాప్' ప్రారంభించారు. నేడు ఆ చిన్న షాపు.. ఇండియా, దుబాయ్‌లో కలిపి 18 అవుట్‌లెట్లతో ఒక పెద్ద ఐస్ క్రీం చైన్‌గా ఎదిగింది.మొదటి షాపు పెట్టడానికి ఎంత ఖర్చయ్యిందివ్యాపారం ప్రారంభించాలనుకునే యువత కోసం ప్రదీప్ ఇటీవల తన మొదటి అవుట్‌లెట్ పెట్టుబడి వివరాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. బెంగళూరు లో ఒక ఫుడ్ అవుట్‌లెట్ ప్రారంభించాలంటే సుమారుగా రూ. 22 లక్షల బడ్జెట్ అవసరమని ఆయన వివరించారు. ఆ ఖర్చుల వివరాలు ఇలా ఉన్నాయి..రెంటల్ డిపాజిట్: రూ.2.4 లక్షలు.ఫర్నిచర్, ఇంటీరియర్స్: దీనికి అత్యధికంగా రూ.10 లక్షలు ఖర్చు చేశారు.లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు: రూ. 60,000.ఇతర పరికరాలు : రూ. 2 లక్షలు.ముడి సరుకులు, ప్యాకేజింగ్: రూ.3.2 లక్షలు.బ్రాండింగ్, మార్కెటింగ్: రూ.1 లక్ష.స్టాఫ్ శాలరీలు (మొదటి నెల): రూ. 80,000.వర్కింగ్ క్యాపిటల్: రూ. 2 లక్షల బఫర్ అమౌంట్ ఉంచుకున్నారు.ప్రదీప్ ఇస్తున్న సలహా"షాపు ఇంటీరియర్స్‌ను ఆర్భాటంగా డిజైన్ చేయాల్సిన అవసరం లేదు. మీ వస్తువు రుచి బాగుండి, కస్టమర్లు మళ్లీ మళ్లీ మీ దగ్గరకు వస్తే అదే నిజమైన సక్సెస్" అని ప్రదీప్ కన్నన్ అంటారు. మీరు కూడా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలనుకుంటే కేవలం సమాజం ఏమనుకుంటుందో అని భయపడకుండా ముందడుగు వేయడమే విజయానికి తొలిమెట్టు.

## ఒకప్పుడు డెలివరీ బాయ్.. ఇప్పుడు కోటీశ్వరుడు!

### డిగ్రీతో పనిలేదు, తెలివితేటలు ఉంటే చాలు!



మనలో చాలామంది "మంచి డిగ్రీ ఉంటేనే సెటిల్ అవుతాం" అని నమ్ముతుంటారు. కానీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ (తీవఅఎఅఅస్త్ర) లో ఉన్న ఒక యువకుడి కథ చూస్తే.. సక్సెస్‌కు కావాల్సింది సర్టిఫికెట్లు కాదు, సరైన సమయంలో తీసుకునే నిర్ణయాలని అర్థమవుతుంది. కేవలం రూ. 21,000 జీతంతో మొదలుపెట్టి, నేడు ఏకంగా రూ. 60 కోట్ల డీల్స్ క్లోజ్ చేసే స్థాయికి ఎదిగిన ఒక డెలివరీ బాయ్ సక్సెస్ జర్నీ ఇప్పుడు నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.కష్టాల కడలిలో తొలి అడుగులుకరోనా కష్టకాలంలో ఉద్యోగ మార్కెట్ అంతా అతలాకుతలమైన వేళ, ఆ యువకుడికి వేరే ఆప్షన్ లేక ఒక ఫైనాన్షియల్ సంస్థలో 'డాక్యుమెంట్ ఎగ్జిక్యూటివ్'గా చేరాడు. పేరు వినడానికి చాలా రిచ్‌గా ఉన్నా నిజానికి అది ఒక డెలివరీ బాయ్ లాంటి ఉద్యోగం. ఢిల్లీలో మండుతున్న ఎండలు, వణికించే చలిని లెక్కచేయకుండా క్లయింట్ల దగ్గర నుంచి ఫైళ్లు సేకరించి బ్యాంకులకు అందించడమే అతని పని. నాలుగున్నరేళ్లు కష్టపడితే అతని జీతం రూ. 18,000 నుంచి కేవలం రూ. 21,000 కి మాత్రమే పెరిగింది.టర్నింగ్ పాయింట్: ఆ ఒక్క పరిచయం జీవితాన్నే మార్చేసింది!ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్ తో ఏర్పడిన పరిచయం అతని జీవితాన్ని మలుపు తిప్పింది. స్వతంత్రంగా ఫండింగ్ కేసులు తీసుకురావాలని, వచ్చిన లాభాన్ని 50-50 నిష్పత్తిలో పంచుకుందామని ఆ జూా ఆఫర్ ఇచ్చాడు. ఇది గమనించిన ఆ యువకుడు, ఫీల్డ్ వర్క్ చేస్తున్నప్పుడు తను సంపాదించిన నెట్‌వర్క్ ను వాడుకోవడం మొదలుపెట్టాడు. మెల్లగా లోన్ ప్రాసెస్, బ్యాంకింగ్ రూల్స్, ఫైనాన్షియల్ కన్సల్టెన్సీలో పట్టు సాధించాడు.నేడు వందల కోట్ల టర్నోవర్ప్రస్తుతం అతను కేవలం కాగితాలు మోసే వ్యక్తి కాదు, ఒక సక్సెస్‌ఫుల్ ఫైనాన్షియల్ కన్సల్టెంట్. ప్రాజెక్ట్ ఫండింగ్, ఈక్విటీ ఫండింగ్, మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్ వంటి హై-టికెట్ డీల్స్ నిర్వహిస్తున్నాడు. తాజాగా రూ. 60 కోట్ల డీల్ క్లోజ్ చేయడమే కాకుండా హోటళ్లు, హాస్పిటల్స్ కొనుగోలు, విక్రయాల రంగంలోకి కూడా అడుగుపెట్టాడు. ఇప్పుడు అతని వార్షిక ఆదాయం రూ. 1-2 కోట్ల మధ్యలో ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు.సోషల్ మీడియా రెస్పాన్స్‌రెడిట్ వేదికగా అతను పంచుకున్న ఈ స్టోరీ ప్రస్తుతం ఇంటర్నెట్ లో విపరీతంగా తీవఅఎఅఅస్త్ర అవుతోంది. "మార్కెట్ కు నీ డిగ్రీతో పనిలేదు, నువ్వు పనిని ఎంత పర్ఫెక్ట్ గా డెలివరీ చేస్తావనేదే ముఖ్యం" అన్న అతని మాటలు యువతకు పెద్ద ఇన్స్పిరేషన్ గా నిలుస్తున్నాయి. నెటిజన్లు "అద్భుతమైన జర్నీ బ్రదర్.. నీ కష్టం ఇతరులకు స్ఫూర్తి" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

# సౌత్ సినిమాలు చూడటాన్ని ఎంజాయ్ చేస్తా!



స్టార్ హీరోయిన్ రవీనా టండన్ కూతురు రాషా తడానీ అప్పుడే పెద్ద సెలబ్రిటీ అయిపోయింది. చేసింది ఒక్క సినిమా (ఆజాద్)నే అయినా ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక ఆజాద్ మూవీలో ఉయి అమ్మా పాటలో డ్యాన్స్‌తో ఇరగదీసి సెన్సేషన్ అయింది. ఈ బ్యూటీ శ్రీనివాస మంగాపురం మూవీతో తెలుగులో ఎంట్రీ ఇవ్వనుంది. సూపర్‌స్టార్ కృష్ణ నటవారసత్వాన్ని కొనసాగిస్తూ ఘట్టమనేని జయకృష్ణ (రమేశ్‌బాబు తనయుడు) వెండితెరకు హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఈ మూవీలో రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

తాజాగా ఆమె మాట్లాడుతూ.. నాకు దక్షిణాది సినిమాలు చూడటమంటే చాలా ఇష్టం. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్‌బాబు.. ఇలా అందరి సినిమాలు చూస్తుంటాను. వాళ్ల సినిమాలన్నీ కొత్త అనుభూతినిస్తాయి. ఇప్పుడదే ఇండస్ట్రీలో భాగం కావడం సంతోషంగా ఉంది. దీన్ని నేను ఎంజాయ్ చేస్తున్నాను.

హీరోయిన్స్ కూడా..

హీరోలే కాదు, అక్కడ హీరోయిన్స్ రష్మిక మందన్నా, శ్రీలీల.. ఇలా అందరూ స్ఫూర్తిదాయకంగా ఉంటారు. అలాంటి సినీ ప్రపంచంలో భాగమయ్యే అవకాశం లభించినందుకు గర్వంగా ఉంది. నా జర్నీ చక్కగా ముందుకు సాగుతుందనుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. శ్రీనివాస మంగాపురం విషయానికి వస్తే.. ఆర్ఎక్స్ 100, మంగళవారం ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది. మరోవైపు రాషా.. లైకే లైకా అని ఓ హిందీ మూవీ కూడా చేస్తోంది.

# శరవణన్ 'లీడర్' రిలీజ్ డేట్ కన్ఫార్మ్




తమిళనాడుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లీడర్' విడుదలకు సిద్ధమైంది. 50 ఏళ్ల వయసులో 'లెజెండ్' సినిమాతో వెండితెరకు పరిచయం అయిన ఆయన, ఆ చిత్రం తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని ఇప్పుడు ఈ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌ను చూస్తుంటే ఇది ఒక భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తండ్రి-కూతురు మధ్య ఉండే సెంటిమెంట్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా నటించగా, శ్యామ్, ఆండ్రియా, సంతోష్ ప్రతాప్, లాల్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. లెజెండ్ శరవణన్ తన స్వంత నిర్మాణ సంస్థ 'ది లెజెండ్ న్యూ శరవణ స్టోర్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీగా నిర్మించారు. ఈ సినిమాను తమిళ్ మరియు తెలుగు భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నారు.

# గోపీచంద్ మలినేని మాస్ కౌంటర్!



నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'ఔఐ-111'. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇప్పటికే లేడీ సూపర్ స్టార్ నయనతార మెయిన్ హీరోయిన్‌గా ఖరారైన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ చిత్రంలో మరో యంగ్ బ్యూటీని ఎంపిక చేసుకున్నట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సెకండ్ పార్ట్ కోసం మరో హీరోయిన్ అవసరమని, ఆ పాత్ర కోసం డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు టాక్. అయితే డింపుల్ హయాతి ఎంపికపై ఒక నెటిజన్ సీరియస్ అవుతూ .. "ఇంత హైప్ ఉన్న సినిమాను ఎలా చెడగొట్టాలో మేకర్స్‌ను చూసి నేర్చుకోవాలి. డింపుల్ బదులు రవీనా టాండన్‌ను తీసుకుంటే బాగుండేది, ఇదొక బ్లండర్ మిస్టేక్" అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై దర్శకుడు గోపీచంద్ మలినేని చాలా కూల్‌గా, సెటైరికల్‌గా స్పందించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన ఒక ఫేమస్ మీమ్ వీడియోను షేర్ చేస్తూ.. "మీకేమన్నా చెప్పారా ఎవరైనా.. నేనెవరికీ చెప్పలేదండి!" అనే డైలాగ్‌తో కౌంటర్ ఇచ్చారు. ఈ పోస్ట్ ద్వారా డింపుల్ హయాతిని తీసుకున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఆ రూమర్లకు చెక్ పడినట్లయింది. అయితే, అసలు ఆ రెండో హీరోయిన్ ఎవరు? అనే ఉత్కంఠ ఇప్పుడు నందమూరి అభిమానుల్లో నెలకొంది.

# హీరో వెంకట్ 'హరుడు' రిలీజ్ ఎప్పుడంటే?



శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు తదితర సినిమాలతో అప్పట్లో సక్సెస్ అందుకున్న హీరో వెంకట్.. తర్వాత అడపాదడపా మూవీస్ చేస్తూనే ఉన్నాడు. గతేడాది రిలీజైన 'ఓజీ'లోనూ పవన్ కల్యాణ్‌కి అన్నగా నటించాడు. ఇతడు హీరోగా చేసిన 'హరుడు' సినిమా విడుదలకు సిద్ధమైంది. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు డాక్టర్.దిక్కల లక్ష??మణ్ రావు, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మించారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేశారు. తాజాగా మే 8న చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. హెబ్బా పటేల్ , సలోని , నటషా , అలీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.




# రాంచరణ్ ఆర్‌సీ 17 క్రేజీ న్యూస్.. మరో మ్యూజిక్ డైరెక్టర్‌తో చర్చలు !

టాలీవుడ్‌లో సుకుమార్ -రాంచరణ్ కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిందని తెలిసిందే. ఈ క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17 సందడి చేయనుంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించనున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు కూడా వచ్చాయి. అయితే తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం కోసం మరో మ్యూజిక్ డైరెక్టర్ పేరును పరిశీలిస్తున్నట్టు ఓ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ అతడెవరో తెలుసా..? ధురంధర్ మ్యూజిక్ డైరెక్టర్ శశ్వత్ సచ్‌దేవ్. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు. ఇదే నిజమైతే ఆర్‌సీ 17పై అంచనాలు మరింత పెరిగిపోవడం ఖాయమైనట్టే. మరి రాబోయే రోజుల్లో రాంచరణ్-సుకుమార్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. రాంచరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే.. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామా గా వస్తోన్న ఈ చిత్రానికి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పెద్ది ఏప్రిల్ 30న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.



# ఓటీటీలోకి ధురంధర్ బ్యూటీ 'యుఫోరియా'..

## ఇంతకీ ప్లాట్‌ఫాం ఏంటో తెలుసా?

టాలీవుడ్ డైరెక్టర్ గుణశేఖర్ దర్శకత్వంతో తెరకెక్కిన చిత్రం యుఫోరియా సోషల్ డ్రామా నేపథ్యంలో హోం బ్యానర్ గుణ హ్యాండ్ మేడ్ ఫిలిమ్స్‌పై నీలిమ గుణ తెరకెక్కించిన ఈ మూవీలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గౌతమ్ వాసు దేవ్ మీనన్ జయదేవ్ నాయర్ పాత్రలో నటించగా.. భూమికా చావ్లా కీలక పాత్ర పోషించింది. ధురంధర్ భామ సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్ప లత ఇతర కీలక పాత్రల్లో నటించారు. 2026 ఫిబ్రవరి 6న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ కమర్షియల్ సక్సెస్ అందుకోలేకపోయినా.. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంది. అయితే ఈ చిత్రానికిగాను ఉత్తమ సహాయ నటిగా భూమికా చావ్లా, ఉత్తమ కథా రచయితగా గుణశేఖర్ రెండు గద్దర్ అవార్డులను అందుకున్నారు. కాగా ఈ చిత్రం ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో ప్రీమియర్ కానుంది. యుఫోరియా ఏప్రిల్ 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 8 వారాల థియాట్రికల్ విండో తర్వాత ఓటీటీలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి రెస్పాన్స్ రాబట్టుకుంటునేది ఆసక్తికరంగా మారింది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.